

RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 124 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | సోమవారం 23 డిసెంబర్ 2024 | వెల : 4/-

- ఇక గవర్నర్ ఆమోదమే తరువాయి
- ఆర్వోఆర్ -2024 బిల్లుకు ఉభయ సభలు ఆమోదం
- గవర్నర్ ఆమోదం తెలిపితే బిల్లుకు చట్టరూపం
- సభ్యుల సూచనలను చట్టంలో చేర్చుతామన్న రెవెన్యూ మంత్రి
- ఈ ఏడాది జనవరి 9న ఐదుగురు సభ్యులతో కూడిన ధరణి కమిటీ పలు క్షేత్రస్థాయి అధ్యయనాలు చేసింది.



# అడుగు దూరంలో భూ భారతి బిల్లు

హైదరాబాద్

సాగు భూముల రిజిస్ట్రేషన్లు - మ్యుటేషన్ల పోర్టల్ ధరణి స్థానంలో ఇక నుంచి భూభారతి రానుంది. ఇందుకు సంబంధించిన ఆర్వోఆర్-2024 బిల్లు త్వరలోనే చట్టరూపం దాల్చనుంది. ఈ బిల్లుకు శుక్రవారమే శాసనసభ ఆమోదం తెలపగా, శనివారం శాసనమండలిలో చర్చించిన అనంతరం ఛైర్మన్? గుత్తా సుఖేందర్ రెడ్డి ఆమోదముద్ర వేశారు. దీంతో అది గవర్నర్ ఆమోదం కోసం వెళ్లనుంది. ఆయన ఆమోదముద్ర వేయగానే చట్టం అమల్లోకి వస్తుందని రెవెన్యూ వర్గాలు తెలిపాయి. శాసనసభ ఎన్నికలకు ముందు, ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ధరణిని రద్దు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చింది. దాని స్థానంలో కొత్త పోర్టల్‌ను తీసుకొస్తామని చెప్పి భూభారతి పోర్టల్ ఏర్పాటు ప్రక్రియలను పూర్తి చేసింది. ఈ ఏడాది జనవరి 9న ఐదుగురు సభ్యులతో కూడిన ధరణి కమిటీ పలు క్షేత్రస్థాయి అధ్యయనాలు చేసింది. అలాగే వివిధ శాఖలతో సమీక్షల అనంతరం ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. అనంతరం ప్రభుత్వం నియమించిన నిపుణుల బృందం 18 రాష్ట్రాలకు వెళ్లి అక్కడి ఆర్వోఆర్ చట్టాలను అధ్యయనం చేసింది. ఈ క్రమంలో ఆర్వోఆర్ -2020 చట్టాన్ని రూపొందించిన నిపుణులతో వారు సమావేశం అయ్యారు ఈ క్రమంలో నిపుణుల కమిటీ రాష్ట్రంలోని రైతులు, భూ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలకు చరమగీతం పాడేందుకు అవసరమైన అన్ని రకాల - మిగతా3లో

## ఈసీ కొత్త రూల్స్!


- ఇకపై పోలింగ్ సీసీటీవీ ఫుటేజ్ చెక్ చేసేందుకు నో ఛాన్స్
- సీసీ కెమెరాల వీడియోలు, వెబ్‌కాస్టింగ్ బహిరంగపరచకుండా చర్యలు
- అభ్యర్థులపై వీడియో రికార్డింగుల వెల్లడీ నిషేధం
- నిబంధనల్లో ఈసీ మార్పులు

# కారు స్టీరింగ్ ఎవరికి?

- పవర్ స్టీరింగ్ చేజారినప్పటి నుంచి కారు పార్టీకి ఎడ తెగని కష్టాలు
- అసలే వలసలతో గులాబీ పార్టీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది
- ఇంత జరుగుతున్నా గులాబీ బాస్ కేసీఆర్ సైలెంట్‌గా ఉన్నారు
- ఇటువంటి సమయంలో బీఆర్ఎస్ పార్టీకి మరో బిగ్ షాక్ తప్పేలా లేదు
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అరెస్ట్ ఖాయమనే వార్త పొలిటికల్ సర్కిళ్లలో చక్కర్లు కొడుతోంది
- ఇదే నిజమైతే.. కారు స్టీరింగ్ ఎవరికి అప్పగిస్తారంటూ చర్చ మొదలైంది

హైదరాబాద్

అధికారంలో బీఆర్ఎస్ పార్టీ ఉన్నప్పుడు వేయి ఏనుగుల బలంతో కనిపించేది. కానీ పవర్ స్టీరింగ్ చేజారినప్పటి నుంచి కారు పార్టీకి ఎడ తెగని కష్టాలు మొదలయ్యాయి. అసలే వలసలతో గులాబీ పార్టీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఇంత జరుగుతున్నా గులాబీ బాస్ కేసీఆర్ సైలెంట్‌గా ఉన్నారు. ఇటువంటి సమయంలో బీఆర్ఎస్ పార్టీకి మరో బిగ్ షాక్ తప్పేలా లేదు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అరెస్ట్ ఖాయమనే వార్త పొలిటికల్ సర్కిళ్లలో చక్కర్లు కొడుతోంది. ఇదే నిజమైతే.. కారు స్టీరింగ్ ఎవరికి అప్పగిస్తారంటూ చర్చ మొదలైంది. ఈ కార్ రేస్ కేసులో కేటీఆర్‌ను విచారించేందుకు - మిగతా3లో



### అల్లు అర్జున్ వ్యక్తిత్వాన్ని హననం చేసేలా

# సీఎం వ్యాఖ్యలు

- అల్లు అర్జున్ ఎపిసోడ్..
- బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు
- తెలుగు సినిమా ఇండస్ట్రీపై పగబట్టినట్లుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారు
- సమస్య ముగిసిన తర్వాత అసెంబ్లీలో ఎంఐఎం సభ్యుడితో ప్రశ్న అడిగించుకుని సినిమా లెవల్లో కథ అల్లి మళ్లీ సమస్యను సృష్టించడం సిగ్గు చేటు

హైదరాబాద్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ బాసటగా నిలిచారు. అల్లు అర్జున్ వ్యక్తిత్వాన్ని హననం చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ అసెంబ్లీలో మాట్లాడిన వ్యాఖ్యలు ఉన్నాయని తెలిపారు. తెలుగు సినిమా ఇండస్ట్రీపై పగబట్టినట్లుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సంధ్యా - మిగతా3లో



## మార్మోగిన అయ్యప్ప నామం

- అయ్యప్ప ఆభరణాల ఊరేగింపు 'తంకా అంకి'
- మండల పూజకు ముందు జరిగే యాత్ర విశేషాలివే!
- 'బుధవారం నాటికి అయ్యప్ప సన్నిధానానికి చేరిక'
- డిసెంబరు 25నాటికి అయ్యప్ప సన్నిధానానికి చేరిక

## అల్లుఅర్జున్ ఇంటిపై రాళ్ల దాడి



తీవ్ర ఉద్రిక్తత - భారీగా పోలీసుల మోహరింపు

అల్లు అర్జున్ ఇంటిపై రాళ్లు విసిరిన ఓయూ జేఏసీ నాయకులు

హైదరాబాద్ అల్లు అర్జున్ ఇంటి వద్ద ఉద్రిక్తత

హైదరాబాద్

ఓయూ జేఏసీ విద్యార్థి సంఘాల ఆందోళనతో జూబ్లీహిల్స్‌లోని అల్లు అర్జున్ ఇంటి వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. రేవతి మరణానికి అల్లు అర్జునే కారణమంటూ - మిగతా3లో

# అల్లు అర్జున్ వెంటనే సీఎంకు క్షమాపణ చెప్పాలి

- అల్లు అర్జున్ వ్యాఖ్యలపై స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- అల్లు అర్జున్ వెంటనే సీఎంకు క్షమాపణ చెప్పాలని డిమాండ్
- అల్లు అర్జున్ అన్నమాటలు వెనక్కి తీసుకోవాలి
- అర్జున్ ప్రెస్‌మీట్ పెట్టవలసిన అవసరం ఏమొచ్చింది
- రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు ఎదురుదాడిగా మాట్లాడడం సరికాదని స్పష్టీకరణ



# మార్మోగిన అయ్యప్ప నామం

శబరిమలలో అయ్యప్ప మండల పూజ కోసం 'తంకా అంకి' (బంగారు ఆభరణాలు) తీసుకెళ్లే ఉత్సవ ఊరేగింపు ఆదివారం పతనంతిట్టలోని అరన్ములలోని పార్థసారథి ఆలయం నుంచి బయలుదేరింది. ఈ నెల 25వ తేదీ(బుధవారం) వరకు ఈ తంకా అంకి ఊరేగింపు కొనసాగుతుంది. అదే రోజు సాయంత్రం అయ్యప్ప స్వామికి బంగారు ఆభరణాలు అలంకరించి, ఆ తర్వాత దీపారాధన చేస్తారు. దీంతో తంకా అంకి కార్యక్రమం ముగుస్తుంది.

**మార్మోగిన అయ్యప్ప నామం**

పార్థసారథి ఆలయంలో ఆదివారం ఉదయం 5 నుంచి 7 గంటల మధ్య తంకా అంకిని దర్శించుకోవడానికి భక్తులకు అవకాశం కల్పించారు. అనంతరం 7 గంటల సమయంలో తంకా అంకి ఊరేగింపు ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో భారీగా భక్తులు, ట్రావెన్ కోర్ దేవస్వమ్ బోర్డు (టీడీబీ) అధికారులు పాల్గొన్నారు. 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ మంత్రాన్ని పఠించారు. ఈ కార్యక్రమంలో టీడీబీ అధ్యక్షుడు పీఎస్ ప్రశాంత్ కూడా పాల్గొన్నారు.

**'బుధవారం నాటికి అయ్యప్ప సన్నిధానానికి చేరిక'**

"ఆదివారం ఉదయం పార్థసారధి ఆలయం నుంచి తంకా అంకి ఊరేగింపు ప్రారంభమైంది. మార్గంలో 74 ఆలయాల దగ్గర ఈ ఊరేగింపు ఆగుతుంది. డిసెంబర్ 25 నాటికి శబరిమల అయ్యప్ప సన్నిధానానికి చేరుకుంటుంది. ఈ ఉత్సవ ఊరేగింపు పంబాకు చేరుకోగానే దేవస్వమ్ మంత్రి వీఎన్ వాసవన్ స్వాగతం పలుకుతారు." అని టీడీబీ అధ్యక్షుడు పీఎస్ ప్రశాంత్ తెలిపారు.

**ట్రావెన్ కోర్ దేవస్థానం ఇచ్చిన ఆభరణాలు**






శబరిమలలో నిర్వహించే మండల పూజ కోసం ఉపయోగించే 'తంకా అంకి' ఊరేగింపు అయ్యప్ప భక్తులకు చాలా ముఖ్యమైనది. శబరిమల పుణ్యక్షేత్రంలో కొలువైన అయ్యప్ప విగ్రహానికి అలంకరించే పవిత్ర బంగారు ఆభరణాలే తంకా అంకి. 1970వ దశకంలో 453 సవర్ల బరువున్న బంగారు ఆభరణాలను ట్రావెన్ కోర్ సంస్థానం అయ్యప్పకు సమర్పించింది.

**ఉరేగింపుగా అయ్యప్ప ఆలయానికి**

అయ్యప్పకు సమర్పించే బంగారు ఆభరణాలను అరన్ముల పార్థసారథి ఆలయంలో భద్రపరుస్తారు. మండలం, మకరవిళక్కు సమయంలో శబరిమల అయ్యప్ప సన్నిధానానికి ఊరేగింపుగా తీసుకెళ్తారు. డిసెంబరు 22న ప్రారంభమైన తంకా అంకి ఉత్సవ ఊరేగింపు డిసెంబరు 25తో ముగుస్తుంది. అదే రోజు సాయంత్రం హారతికి ముందు అయ్యప్పకు బంగారు అభరణాలను అలంకరిస్తారు. ఆ తర్వాత డిసెంబరు 26 మండల పూజ జరుగుతుంది.

# పంట పండించిన ప్రైవసీ ఆప్షన్

**హైదరాబాద్ :** ధరణి ఆలోచనలోనే పెద్ద దందా ఉందన్నది రాజకీయ వర్గాల్లోని చాలా మందికి ఉన్న అనుమానం. ఈ విషయాన్ని పోర్టల్ వినియోగంలోకి వచ్చాక? అప్పుడు ప్రతిపక్ష పార్టీలో ఉన్న రేవంత్ రెడ్డి గుర్తించారు. కళ్ల ముందే కోట్ల భూముల రికార్డులు మారిపోతున్నాయని ఆరోపించారు. అర్థరాత్రి వేళ మారిపోయిన నిషేధిత భూముల జాబితాలోని భూముల వివరాల్ని ప్రజల ముందుంచి.. ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వాటన్నింటిపై మౌనమే సమాధానంగా ఉంటూ వచ్చిన కేసీఆర్ సర్కార్.. భూమి రికార్డుల్లో అనేక చీకటి మార్పులకు తెరలేపింది. రాత్రికి రాత్రే అనుయాయులకు కోట్లు కురిపించే భూముల్ని ధారాదత్తం చేసేసింది. హైదరాబాద్ లో సాఫ్ట్ వేర్ రంగానికి ఆయువు పట్టుగా ఉన్న ప్రాంతం.. గచ్చిబౌలికి కూతవేటు దూరంలోనే ఉంటుంది.. వట్టినాగులపల్లి. రంగారెడ్డి జిల్లాలోని ఈ ప్రాంతం.. జీవో 111 పరిధిలోని 84 గ్రామాల్లో ఒకటి. ఇక్కడ వ్యవసాయేతర కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం లేకపోవడంతో 1 లక్షా 32 వేల ఎకరాల భూములు.. ఎలాంటి నిర్మాణాలు చేపట్టేందుకు వీలు లేకుండా పోయాయి. సిటీకి చాలా దగ్గరగా ఉండడం, మరో పెద్ద సిటీ పట్టేంత ప్రాంతమైన ఇక్కడ భూముల విలువ లక్షల కోట్లు. అదిగో.. ఆ భూములే ఆనాటి ప్రభుత్వ పెద్దల టార్గెట్ అంటుంటారు. రేవంత్ రెడ్డి సైతం అనేక సార్లు ఈ విషయాల్ని ప్రస్తావించారు. ఈ విషయాన్ని మరింత వివరంగా తెలుసుకోవాలి అంటే?2009లో సత్యం రామలింగరాజు కుంభకోణం బయటపడింది. దాంతో.. వట్టినాగుల పల్లిలోని సత్యం రామలింగరాజుకు చెందిన వంద ఎకరాల భూములను ఈడీ, సీబీఐ అటాచ్ చేశాయి. వాటిపై కన్నేసిన నేతలు.. ధరణి పేరుతో సరికొత్త కుట్రకు దారితీశారు. వివాదాల్లోని సత్యం భూముల్ని లీగల్‌గా మార్చుకుని.. వేల కోట్ల విలువైన భూములను దక్కించుకోడానికి ధరణి పేరుతో స్కెచ్ వేశారనేది ప్రతిపక్షాల ఆరోపణ. అందుకే, ధరణి పోర్టల్‌ను రామలింగరాజు రిలేటివ్ శ్రీధర్‌రాజు కంపెనీకి అప్పగించారని ఆరోపిస్తుంటారు. 2018లో ధరణి పోర్టల్ సాఫ్ట్‌వేర్ అండ్





డెవలప్‌మెంట్ బాధ్యతను ఎఒడఈూ కంపెనీకి ఇచ్చారు. ఈ ఎఒడఈూ సంస్థ 2018 జూన్‌లోనే బ్యాంకులకు లక్ష కోట్లు ఎగ్గొట్టింది. అలాంటి సంస్థ ధరణి వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టును ఎందుకు అప్పగించారనేది అసలు ప్రశ్న. అంతే కాదండోయ్? ఈ ఎఒడఈూ సంస్థ.. సత్యం కుంభకోణం బయటపడిన తరువాత రామలింగరాజు తనయుడు తేజ రాజుకు చెందిన మేటాస్ ఇన్‌ఫ్రాను టేకోవర్ చేసింది. ఆ తర్వాత ఎఒడఈూ కంపెనీ టెర్రాసిస్‌గా మారిపోయింది. టెర్రాసిస్‌గా మారిన ఈ కంపెనీని ఖిబీజీనిబివశ్రీజీ కంపెనీ కొనేసింది. ఈ ఖిబీజీనిబివశ్రీజీ ఓనర్ మరెవరో కాదు. సత్యం రామలింగరాజు బంధువు గాధి శ్రీధర్ రాజు. ఓవరాల్‌గా చూస్తే ధరణి పోర్టల్ సత్యం రామలింగరాజు బంధువైన శ్రీధర్ రాజు చేతిలోకి వెళ్లిపోయింది. అయితే.. ఈ కంపెనీ హెడ్ క్వార్టర్ అడ్రస్ మాత్రం అమెరికా. అందుకే.. ధరణి పోర్టల్ ని అమెరికన్ కంపెనీకి ఇచ్చామని బీఆర్ఎస్ నేతలు చెప్పేది. కానీ.. వాస్తవంలో మాత్రం ఇదీ ఆ సంస్థ వెనుకున్న చరిత్ర.అంతే కాదు.. ఈ సంస్థలో పనిచేసే ఉద్యోగుల సంఖ్య కేవలం 250 నుంచి 500 మంది మాత్రమే. ఇంత తక్కువ మంది ఉన్న సంస్థకు రాష్ట్రంలోని లక్షలాది ఎకరాల భూములు, రైతుల బ్యాంకు, వ్యక్తిగత వివరాలు ఉండే ధరణి బాధ్యతలు ఎలా ఇచ్చారనేది ప్రశ్న. పైగా సత్యం తనయుడు, ఒకప్పటి మేటాస్ ఇన్‌ఫ్రా ఛైర్మన్ తేజ రాజుతో మంత్రి కేటీఆర్ ఫారెన్ ట్రిప్పులు వేయడం వెనక ఏదో జరుగుతోందని పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఎప్పటి నుంచో ఆరోపిస్తూనే ఉన్నారు. ఔమి, ఎఅూ, ఇన్ఫోసిస్ ఉన్నప్పటికీ.. అప్పట్లో ఒక డీఫాల్ట్ కంపెనీకే సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ బాధ్యతలు ఎందుకు ఇచ్చారన్నది అప్పటి ప్రతిపక్ష నాయకుల ప్రధాన అనుమానం. దాని వెనుకున్న సీక్రెట్ స్కెట్.. ఇంకొక పెద్ద అనుమానం.సత్యం రామలింగరాజు వట్టినాగులపల్లిలోని వేల కోట్ల భూముల కోసం ఎన్ ఫోర్స్మెంట్ డైరెక్టరేట్-ఈడీ ని అడిగితే.. రూ. 8,500 కోట్ల ఫైన్ కట్టి భూములు తీసుకోవాలని ఈడీ రిప్లై ఇచ్చింది. అంత మొత్తం కట్టడం ఎందుకని కేసీఆర్ సర్కార్ సత్యం రామలింగరాజు బంధువు కంపెనీకి ఇన్‌డైరెక్టుగా ధరణి సాఫ్ట్‌వేర్ బాధ్యతలు అప్పగించారనే టాక్ నడుస్తోంది. ఈ సాఫ్ట్‌వేర్ సాయంతో వందల ఎకరాల భూములను లీగల్ చేసుకున్నట్లు ప్రధాన ఆరోపణ.అలాగే.. ధరణిలో ప్రైవసీ అనే ఆప్షన్ ఉంది. కాబట్టి? ఈ భూములు ఎవరు కొన్నారు అనే విషయం బయటికి రాదు. కేవలం పెద్దోళ్ల కోసమే ఈ ఆప్షన్ తీసుకొచ్చారనేది చాలా మందికున్న అనుమానం. 111 జీవో రద్దుకు ముందు రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలోని సుమారు వెయ్యి ఎకరాలను రాత్రికి రాత్రే ప్రైవసీ లిస్టులోకి ఎక్కించారు. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులలో ప్లాట్లుగా, ధరణిలో అంటే తహసీల్దార్ ఆఫీసులలో వ్యవసాయ భూములుగా రిజిస్ట్రేషన్స్ చేసుకున్నారు. ఇదంతా ఓ పెద్ద గోల్‌మాల్ అంటోంది మొదటి నుంచి కాంగ్రెస్ నాయకత్వం. అందుకే.. ఈ భూముల తారుమారు వ్యవహారాల్ని కొనసాగనివ్వకుండా.. భూభారతి పేరుతో నిపుణుల సలహాతో రూపొందించిన పకడ్బందీ వెబ్ పోర్టల్ ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

# పూరీ జగన్నాథ ఆలయంలో దర్శనాలకు సరికొత్త విధానం!

జనవరి ఒకటి నుంచి అమలులోకి..!

ప్రముఖ క్షేత్రమైన పూరీ జగన్నాథ ఆలయంలో భక్తులకు దర్శనం కోసం మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఒడిశా ప్రభుత్వం సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టబోతున్నది. ఈ కొత్త విధానాన్ని జనవరి ఒకటి నుంచి ప్రారంభించనున్నట్లు న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ ఆదివారం తెలిపారు. ఆలయ నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కొత్త విధానానికి సంబంధించిన ఏర్పాటు ఈ నెల 27, 28 తేదీల్లోగా పూర్తవుతాయన్నారు. డిసెంబర్ 30, 31 తేదీల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించనున్నామన్నారు. జనవరి ఒకటి నుంచి కొత్త దర్శన విధానం పూర్తిస్థాయిలో అమలులోకి తీసుకువస్తామన్నారు. ఈ కొత్త విధానంలో ఆలయానికి వచ్చే మహిళలు, పిల్లలు, వికలాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు. కొత్త విధానంలో భక్తులు ప్రస్తుతం ఉన్న ద్వారం (సత్పహచ) నుంచి జగన్నాథ ఆలయంలోకి ప్రవేశిస్తారు.

అయితే, బయటకు వెళ్లేందుకు రెండు వేర్వేరు దారులుంటాయి. జగన్నాథ ఆలయ ప్రధాన కార్యనిర్వహణాధికారి అరబింద పాడి ఆలయాన్ని సందర్శించి ఆలయంలో కొత్త విధానం అమలుకు సంబంధించిన పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తుల రద్దీ కారణంగా గర్భగుడిలో కొలువైన దేవతామూర్తులను దర్శించుకోవడానికి తరచుగా ఇబ్బందులు ఎదురవుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కొత్త విధానంలో నాట్య మండపంలో ఆరు వరుసల్లో ప్రత్యేకంగా బారికేడట్లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు



రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ పనుల కోసం ఒడిశా బ్రిడ్జి అండ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ లిమిటెడ్‌ని నియమించి.. ఏడాది చివరికల్లా పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రత్న భండార్ మరమ్మతు పనులపై ఎలాంటి ప్రభావం ఉండదని ఆయన చెప్పారు. రత్నా భండార్ పునరుద్ధరణ పనులను మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (%ూూ×%) లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.

## ఈసీ కొత్త రూల్స్!

ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ రికార్డులను ఎవరైనా తనిఖీ చేసేందుకు అనుమతించే నిబంధనల్లో ఎన్నికల సంఘం (ఈసీ) మార్పులు చేసింది. ఇక నుంచి పోలింగ్‌కు సంబంధించిన సీసీ టీవీ ఫుటేజ్‌ను, వెబ్‌కాస్టింగ్ రికార్డులను, అభ్యర్థులకు చెందిన వీడియో రికార్డులను తనిఖీ చేయకుండా నిషేధం విధించింది. దీనిపై కాంగ్రెస్ మండిపడింది. ఎన్నికల్లో పారదర్శకతకు ఇది విఘాతమని స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం సిఫార్సు మేరకు ఎన్నికల నిర్వహణ నిబంధనలు-1961లోని రూల్ 93(2)(ఏ)ను శుక్రవారం కేంద్ర న్యాయశాఖ సవరించింది. ఈ సవరణకు ఓ కోర్టు కేసు కారణమని ఈసీతోపాటు న్యాయశాఖ వేర్వేరుగా వివరణ ఇచ్చాయి. కొత్త సవరణతో ఎలక్ట్రానిక్ రికార్డులు మినహా ఇతర పత్రాలు, డాక్యుమెంట్లు తనిఖీకి అందుబాటులో ఉంటాయి. పోలింగ్ బూత్‌లలోని సీసీ టీవీ కెమెరాల తనిఖీవల్ల ఓటర్ల గోప్యతకు భంగం కలుగుతోందని, అందుకే నిషేధం విధించామని ఈసీ వర్గాలు వెల్లడించాయి. ఈ ఫుటేజ్‌ను వినియోగించుకుని కృత్రిమ మేధ ద్వారా నకిలీ వీడియోలను తయారు చేస్తున్నారని తెలిపాయి. రూల్ 93కి సవరణ తర్వాతా అభ్యర్థులకు ఎలక్ట్రానిక్ రికార్డులు అందుబాటులో ఉంటాయని, కానీ ఇతరులు తనిఖీ చేయడానికి అనుమతి ఉండదని వివరించాయి. హరియాణా ఎన్నికలకు సంబంధించిన అన్ని రికార్డులను మహమ్మద్ ప్రాచా అనే వ్యక్తికి షేర్ చేయాలని ఇటీవల పంజాబ్ అండ్ హరియాణా హైకోర్టు ఆదేశించింది. రూల్ 93 (2)లో పత్రాలు, డాక్యుమెంట్లు, ఎలక్ట్రానిక్ రికార్డులనే విభజన లేనందున అన్ని రికార్డులను ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. అయితే దీనిని ఈసీ వ్యతిరేకించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిబంధనలకు సవరణ చేసింది.

**ఈసీ ఎందుకు భయపడుతోంది? కాంగ్రెస్**

అయితే ఎన్నికల నిబంధనను మార్చడంపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. పారదర్శకతకు ఈసీ ఎందుకు భయపడుతోందని ప్రశ్నించింది. ఈ సవరణను న్యాయపరంగా సవాలు చేస్తామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ శనివారం స్పష్టం చేశారు. కోర్టు తీర్పును పాటించాల్సిన ఈసీ, అందుకు విరుద్ధంగా నిబంధనలకు సవరణ చేయడం విడ్డూరమని వ్యాఖ్యానించారు.

## కుటుంబంతో కలిసి సజీవ దహనానికి రైతు యత్నం..

**రూ.9.91 లక్షల జరిమానా విధించిన పోలీసులు**



**జైపూర్:** భూమికి పరిహారం కోసం కుటుంబంతో కలిసి సజీవ దహనానికి ఒక రైతు ప్రయత్నించాడు. రోడ్డుపై చితి పేర్చి నిరసన తెలిపాడు. దీంతో పోలీసులు భారీగా తరలివచ్చి అడ్డుకున్నారు. అయితే తాజాగా ఆ రైతుకు పోలీసులు షాక్ ఇచ్చారు. రూ.9.91 లక్షల జరిమానా విధించారు. రైతు కుటుంబం సజీవ దహనాన్ని అడ్డుకునేందుకు అయిన ఖర్చుల మొత్తాన్ని వారంలో చెల్లించాలంటూ నోటీస్ పంపారు. రాజస్థాన్‌లోని ఝుంఝును జిల్లాలో ఈ సంఘటన జరిగింది. డిసెంబర్ 10న రైతు విద్యాధర్ యాదవ్ తన కుటుంబంతో కలిసి నిరసన తెలిపాడు. సిమెంట్ కంపెనీకి ఇచ్చిన భూమికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశాడు. పరిహారం అందని పక్షంలో తన కుటుంబంతో కలిసి సజీవ దహనానికి అనుమతించాలని కోరాడు. రోడ్డుపై కట్టెలతో చితిని ఏర్పాటు చేసి నిరసన తెలిపాడు. దీంతో దిగి వచ్చిన ఆ సిమెంట్ కంపెనీ ఆ రైతుకు రూ.3 కోట్లు నష్టపరిహారం చెల్లించేందుకు అంగీకరించింది. కాగా, పోలీసులు తాజాగా రైతు విద్యాధర్ యాదవ్‌కు షాక్ ఇచ్చారు. కుటుంబంతో కలిసి సజీవ దహనానికి పాల్పడతానని బెదిరించినందుకు రూ.9.91 లక్షల జరిమానా విధించారు. ఎస్పీ శరద్ చౌదరి ఆ రైతుకు ఈ మేరకు నోటీసు జారీ చేశారు. రైతు కుటుంబం స్వీయ దహనానికి పాల్పడకుండా నిరోధించడానికి పోలీస్ శాఖకు భారీగా ఖర్చు అయ్యిందని అందులో పేర్కొన్నారు. మరోవైపు అధికార వాహనాల వినియోగంతో పాటు ఏఎస్పీ, ఇద్దరు డీఎస్పీలతోపాటు 99 మంది పోలీసు సిబ్బందిని మోహరించినట్లు ఆ నోట్‌లో పేర్కొన్నారు. దీంతో రాష్ట్ర ఖజానాపై అదనపు ఆర్థిక భారం పడిందని వివరించారు. డిసెంబర్ 24లోగా ఎస్పీ కార్యాలయంలోని ఖాతాల శాఖలో రూ.9,91,577 జమ చేయాలని ఆ రైతుకు పంపిన నోటీస్‌లో డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అందులో హెచ్చరించారు.

## కువైట్ ప్రధానిని భారతదేశానికి ఆహ్వానించిన ప్రధాని మోదీ



ప్రధాని నరేంద్రమోదీ కువైట్ ప్రధాని షేక్ అహ్మద్ అల్ అబ్దుల్లా అల్ అహ్మద్ అల్ సబాను భారత దేశానికి ఆహ్వానించారు. కువైట్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ షేక్ అహ్మద్ అల్ అబ్దుల్లాతో సమావేశమయ్యారు. ఇరుదేశాల సంబంధాలను మరింత బలోపేతం చేసే అంశంపై ఆ సమావేశంలో చర్చించారు. రాజకీయ, వాణిజ్య, ఇంధన, రక్షణ, భద్రత, ఆరోగ్యం, ఎడ్యుకేషన్, టెక్నాలజీ, సాంస్కృతిక భాగస్వామ్యాలపై వీరిమధ్య చర్చ జరిగింది. రెండు దేశాల మధ్య ఆర్థిక సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని ఈ సమావేశంలో ఇరు దేశాల అధినేతలు నిర్ణయించారు. వివిధ రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పటిష్ఠం చేసుకునేందుకు కువైట్ బృందం ఒకసారి భారత్‌లో పర్యటించాలని ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఆహ్వానించారు. భారత విదేశాంగ శాఖ ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించింది.

# కాంగ్రెస్ నాయకుల గల్లా పట్టి నిలదీయండి..

# అన్నదాతలకు కేటీఆర్ బహిరంగ లేఖ

అన్నదాతలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. వంచనను గ్రహించి ఆంక్షలు వద్దని ఆందోళన చేయాల్సిన వేళ ఇది అని తెలిపారు. ఇప్పుడు మేల్కోకపోతే భరోసా ఉండదు.. గోస మాత్రమే మిగులుతుందని చెప్పారు. జాగ్రత్తగా ఉండాలి.. రైతు భరోసా ఎగవేతల మోసాన్ని ఎదురించాలని సూచించారు. ఆంక్షలు.. కోతలతో సగం మందికి ఎగనామం పెట్టే ఎత్తులను చిత్తుచేయాలని సూచించారు. ప్రతి ఎకరాకు.. ప్రతి రైతుకు పెట్టుబడి ఇవ్వాల్సిందేనని పట్టుబట్టాలన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఎత్తులను, నక్క జిత్తులను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులను గల్లా పట్టి నిలదీయాలన్నారు.

**రైతులకు కేటీఆర్ రాసిన బహిరంగ లేఖ యథాతథంగా..**

తెలంగాణ రైతన్నలకు వందనం..!

నిన్న శాసనసభలో రైతు భరోసా మీద జరిగిన చర్చను మీరు చూసే వుంటారు! రైతు భరోసా పైనా ఏమీ చెప్పకుండా.. ఎటూ తేల్చకుండా సంబంధంలేని అంశాలపైకి చర్చను మళ్లించి అసలు సంగతిని అతి తెలివితో పక్కదారి పట్టించాడు ముఖ్యమంత్రి! బాగా అలవాటైన అబద్ధాల డ్రైవర్ల జిమ్మిక్కులను ప్రదర్శించాడు! రైతు భరోసా పథకంపైన ఆంక్షలు.. అనుమానాలు.. సందేహాలు వేటికి సమాధానం చెప్పకుండా దాట వేసింది ప్రభుత్వం!

అంతేకాదు.. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు రైతుబంధు పథకంపై పచ్చి అబద్ధాలతో కూడిన దుష్ప్రచారాన్ని, దాడిని చేశారు! అన్నంపెట్టే రైతును దొంగలా చిత్రించే దుర్మార్గానికి ఒడిగట్టారు! కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి వరుస చూస్తే.. కోతలు కొర్రీలు పెట్టి రైతు భరోసాను సగానికి సగం ఎగవేసే ఎత్తుగడతో ఉన్నట్టు అర్థమైంది..! తిండి పెట్టే రైతుకు తొండి చేసి పైసలు ఎగ్గొట్టే ప్రణాళిక ప్రారంభమైంది! విధివిధానాలు.. మార్గదర్శకాలు ఏమీ సభలో చెప్పకుండా సంక్రాంతి తర్వాత రైతు భరోసా వేస్తాం అని ఒక మాట చెప్పి తప్పించుకుంది సర్కారు!

రైతన్నలారా రైతుబంధును బొంద పెట్టి పనికిమాలిన షరతులు విధించి అరకొరగా రైతు భరోసా అమలు చేసి మిమ్ముల్ని నిండాముంచే ఒక పెద్ద దోఖా జరగబోతున్నది! అప్రమత్తంగా వుండాల్సిన సమయం ఇది..! మోసపోకుండా జాగ్రత్తగా వుండాల్సిన సందర్భం ఇదే! స్థానిక సంస్థల ఎన్నికల గండాన్ని దాటడం కోసం..ఏవో మాయోపాయాలను చేసి మమ అనిపించి పెట్టుబడి సాయానికి పూర్తిగా ఘోరీ కట్టే ఘోరాలు చేయబోతున్నారు!అన్నదాతలారా తస్మాత్ జాగ్రత్త! వంచనను గ్రహించి ఆంక్షలు వద్దని ఆందోళన చేయాల్సిన వేళ ఇది..! ఇప్పుడు మేల్కోకపోతే భరోసా వుండదు ..గోస మాత్రమే మిగులుతుంది!

ఉమ్మడి రాష్ట్రంలో సాగు సంక్షోభం లో మునిగి.. వెన్ను విరిగిన తెలంగాణ అన్నదాతను ఆదుకోవడానికి కేసీఆర్ గారి నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయ రంగంలో అనేక విప్లవాత్మక పాలసీలను పథకాలను ప్రవేశపెట్టింది.! తెల్లెన రైతు తేరుకున్నడు.. ఆగమైన ఎవుసం బాగుపడ్డది! ముఖ్యంగా.. రైతుకు రంధి లేకుండా రెండు పంటలకు పెట్టుబడి సాయం అందించేందుకు కేసీఆర్ గారు



ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం వ్యవసాయాన్ని ఒక పండుగలా మార్చడంలో కీలక పాత్ర పోషించింది! రైతు ఎవరి ముందూ పెట్టుబడి కోసం చేయి చాచే దుస్థితి లేకుండా వానాకాలం.. యాసంగి రెండు పంటలకు అవసరమైన పైసలు నేరుగా బ్యాంకు ఖాతాల్లో పడే ఒక అపురూపమైన ఆలోచన ఆచరణే రైతుబంధు!

కుప్పకూలిన వ్యవసాయాన్ని నిలబెట్టాలన్న సంకల్పంతో తేడా చూప కుండా ప్రతి రైతుకూ పెట్టుబడి పైసలు ఇవ్వాలని నిర్ణయించాం! మొత్తం 11 సీజన్లలో 73 వేల కోట్ల రూపాయలను కర్షకుల ఖాతాల్లో జమ చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం! అవినీతికి.. లీకేజీలకు తావులేని అతిపెద్ద నగదు బదిలీ పథకం రైతుబంధు! యావత్ ప్రపంచం మెచ్చింది..దేశంలో అనేక రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకున్నాయి! అంతేకాదు% మరో 28వేల కోట్ల రుణమాఫీ కింద నేరుగా రైతుల బ్యాంకు అకౌంట్లలో పడ్డాయి! ఈ రెండు స్కీమ్ ల ద్వారానే అక్షరాలా లక్షకోట్ల రూపాయలు అన్నదాతల ఖాతాల్లో డైరెక్ట్ గా జమయ్యాయి! దుక్కి దున్నేవాడి దుఃఖం తీర్చాలన్న లక్ష్యంతో% రైతన్న మీద ప్రేమతో ఈ బృహత్ కార్యక్రమాన్ని అమలు చేసాం! ప్రతి పైసాను సద్వినియోగం చేసుకొని..పుట్లకొద్ది పంటలు పండించి లక్షల కోట్ల సంపద సృష్టించారు మీరు!

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎట్లైనా అధికారంలోకి రావాలని అన్ని వర్గాలతో పాటు రైతాంగానికి కూడా కాంగ్రెస్ పార్టీ ఇష్టమొచ్చిన హామీలను గుప్పించింది! కేసీఆర్ ఎకరానికి 10వేలే ఇస్తున్నడు.. మేం పవర్ లోకి వస్తే 15 వేలు ఇస్తామని వాగ్దానం చేసారు! రైతుభరోసా కింద ప్రతి ఎకరానికి ఏడాదికి 15వేలు ఇస్తామని పార్టీ మేనిఫెస్టోలో చెప్పారు! గద్దెనెక్కిన వంద రోజుల్లో తప్పకుండా అమలు చేసి చూపిస్తామని గ్యారెంటీ కార్డులు ఇంటింటికి తిరిగి పంచారు! కాంగ్రెస్ పార్టీ గెలిచి.. ప్రభుత్వం ఏర్పాటు చేసి ఏడాది కాలం గడిచిపోయింది! ఇంతవరకూ రైతు భరోసా జాడా పత్తా లేదు! పదిహేను వేలు ఇయ్యలేదు సరికదా వున్న పదివేలను ఊడగొట్టారు! ఇప్పటికే రెండు పంట సీజన్లు అయిపోయాయి.. మూడో సీజన్ కూడా వచ్చేసింది! ఈ వానాకాలం పూర్తిగా ఎగ్గొట్టారు! నిన్న యాసంగి రూ.2500 కోట వేసారు! ఇప్పటి యాసంగి ఇస్తారో లేదో తెలియదు! మొత్తంగా ఒక్కో రైతుకు ఒక్కో ఎకరానికి 17,500 రూపాయలను బాకీ పడ్డది రేవంత్ రెడ్డి సర్కారు! అన్నదాతల ఖాతాల్లో పడాల్సిన పైసలు ఇవి! రైతులకు హక్కుగా రావాల్సిన సొమ్ము ఇది! వదులుకోవద్దు! అందుకే ప్రతి రైతు ఈ విషయాన్ని కచ్చితంగా గుర్తు పెట్టుకోవాలి! ఈ సంక్రాంతి తర్వాత రైతు భరోసా వేస్తామని చెబుతున్నది కాంగ్రెస్

ప్రభుత్వం! అందరి రైతులకు ఇస్తారా లేదా అని శాసన సభలో ప్రశ్నిస్తే సప్పుడు లేదు సమాధానం లేదు! పైగా రాళ్లు రప్పలకు ఇచ్చి రైతుబంధు ఇచ్చి దుర్వినియోగం చేసారని అడ్డగోలు గా వాదించారు కాంగ్రెస్ మంత్రులు ఎమ్మెల్యేలు! సర్కారు వైఖరిని గమనిస్తే అర్థంలేని కొర్రీలు .. కోతలు పెట్టి అరకొరగా అమలు చేసి రైతు భరోసా ఇచ్చేసినం అని చెప్పి చేతులు దులుపుకోవాలని కుట్ర చేస్తున్నట్టు స్పష్టంగా అర్థమైతున్నది! అసలు..కొత్తగా ఈ సంక్రాంతి తరువాత రైతు భరోసా వేసే రాగం ఎందుకు అందుకున్నారు? ఇప్పుడు వేసేది వానాకాలం పైసలా? యాసంగి పైసలా? ఏడాదికి ఒకే పంటకు ఇస్తారా.? రెండు పంటలకు వేస్తారా? ఈ కుట్రను కూడా రైతాంగం గుర్తించాలి! ఇప్పుడు వేయాల్సింది ఎకరానికి రూ,7500 కాదు..రూ.17500 అని అన్నదాతలు గట్టిగా అడిగితీరాలి!

రైతు భరోసా విధి విధానాలు నిర్ణయిస్తామని కేబినెట్ సబ్ కమిటీ వేసి కాలయాపన చేసారు! జిల్లాల్లో సదస్సులు పెట్టి అభిప్రాయ సేకరణ అంటూ ఇంకొంత కాలం సాగదీసారు! ఎన్నికల ముందు ఎవరి అభిప్రాయాలు తీసుకొని ప్రతి రైతుకు ప్రతి ఎకరానికి 15వేలు ఇస్తామన్నారు..? ఇప్పుడెందుకు ఈ నాటకాలు! ఎన్నికలు ఏరుదాటగానే తెప్ప తగలేస్తున్నారా? గత ఏడాది కాలంగా లీకులు ఇస్తూ ఇన్ కం టాక్స్ కట్టేవాళ్లకు పాన్ కార్డు వున్న వాళ్లకు రైతుబంధు కట్ అని పత్రికల్లో కథనాలు రాయించారు! లక్షలాది మంది ఉద్యోగులకు ఇక భూమితో బంధం తెంపేస్తారా? బ్యాంకు లోన్లు సులభంగా రావడం కోసం ఐటీ చెల్లించి.. పాన్ కార్డు తీసుకున్న వాళ్లందరి నోట్లో మన్నుకొడతారా?

కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకో కుతంత్రం కూడా చేస్తున్నది! కేంద్ర ప్రభుత్వ పీఎం కిసాన్ మార్గదర్శకాలనే రైతు భరోసా కూడా వర్తింపజేస్తామని చెబుతున్నారు! అదే.. గనుక జరిగితే రాష్ట్రంలో సగం మంది రైతులకు కూడా పెట్టుబడి పైసలు రావు! 70 లక్షలకు పైగా రైతన్నలు వుంటే..30 లక్షల మందికి కూడా పీఎం కిసాన్ రావట్లేదు! ప్రతియేటా లబ్ధిదారుల సంఖ్య పడిపోతూనే వుంది! పీఎం కిసాన్ గైడ్ లైన్స్ పెద్ద దగా.. కాంగ్రెస్ దగాకోరులు ఢిల్లీలో పీఎం కిసాన్ మార్గదర్శకాలు వద్దంటారు.. గల్లీలో వాటినే ముద్దంటున్నారు!

ఇప్పటికే బడేభాయ్ బాటలోనే చోటే భాయ్ నడుస్తున్నడు.. రైతు భరోసా విషయంలో కూడా ఆ తోవలోనే పోతే.. 40 లక్షల మంది పైగా అన్నదాతలకు మొండిచెయ్యే గతి! రైతు బంధు మీద కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారం అంతా.. రైతు భరోసాకు కోతలు పెట్టే దురుద్దేశంతో చేస్తున్నదే! రూ.22 వేల కోట్లు రియల్ ఎస్టేట్ ప్లాట్లకు .. క్రషర్లకు ఇచ్చారని దుష్టబుద్ధితో దుర్మార్గమైన ప్రచారం చేస్తూ రైతులను అవమానిస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం! వాస్తవం ఏంటంటే..వానాకాలంలో పోల్చితే యాసంగిలో సాగు తగ్గుతుంది! పత్తి, పసుపు, చెరుకు వంటి పంటలు రెండు సీజన్లు వేయడం సాధ్యంకాదు! కేసీఆర్ ప్రభుత్వం నాడు.. యాసంగిలో కూడా వానాకాలం లెక్క ప్రకారమే రైతుబంధు పైసలు జమ చేసింది! యాసంగిలో వేసిన రైతు బంధు పైసలను దుర్వినియోగం లెక్కల్లో వేసి అన్నదాతలను దొంగలుగా చేసి చూపుతున్నారు.. కాంగ్రెస్ గజదొంగలు!

# కారు స్టీరింగ్ ఎవరికి?

-మొదటిపేజీ తరువాయి

గవర్నర్ నుంచి ప్రభుత్వానికి గ్రీన్ సిగ్నల్ వచ్చేసింది. దీంతో ఏ1గా కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేసింది. కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చి.. వ్యక్తిగతంగా విచారణ చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఆ తర్వాత పరిస్థితులను బట్టి కేటీఆర్‌ను అరెస్ట్ చేయవచ్చన్న చర్చ జోరుగా సాగుతోంది. అంతేకాదు అరెస్ట్ భయమని కేటీఆర్‌తో సహా బీఆర్ఎస్ నేతలందరూ మానసికంగా ప్రిపేర్ అయినట్లు తెలుస్తోంది.ప్రస్తుతం బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్.. విశ్రాంతి తీసుకుంటున్నారు. త్వరలో అమెరికాకు కూడా వెళ్లనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ టైమ్‌లో కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే పార్టీ పరిస్థితి ఏంటనే టెన్షన్ అటు నేతల్లో, ఇటు కేడర్‌లో మొదలైందంట.కేటీఆర్‌కు ప్రత్యామ్నాయంగా ఆయన సోదరి ఎమ్మెల్సీ కవిత, బావ హరీశ్ రావు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఆ ఇద్దరూ పార్టీని సమర్ధవంతంగా లీడ్ చేయగలరని అధినేత కేసీఆర్ భావిస్తున్నారని గులాబీ పార్టీ ఇన్నర్ టాక్. అందుకే కొంత కాలంగా సైలెంట్‌గా ఉన్న కవితను మళ్లీ రంగంలోకి దింపారని తెలుస్తోంది. ఇందులో భాగంగానే ఓ వైపు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూనే,

మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం మొదలుపెట్టారు కవిత.బీఆర్ఎస్ వ్యూహంలో భాగంగానే కవిత అన్ని విషయాల్లోనూ యాక్టీవ్‌గా కనిపిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న మండలి సమావేశాల్లో కవిత ప్రతిపక్ష పాత్రలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రతి అంశంలో ప్రశ్నిస్తూ.. అవకాశం దొరికినప్పుడల్లా సర్కార్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదే సమయంలో మరో ముఖ్య నేత హరీశ్‌రావు సైతం పార్టీలో కీలక పాత్ర పోషించబోతున్నారని తెలుస్తోంది. ఈ క్రమంలోనే అసెంబ్లీలో కేటీఆర్‌కు బదులు హరీశ్‌రావు ఎక్కువగా మాట్లాడుతున్నారని చెబుతున్నారు. అధికార పక్షానికి ధీటుగా సమాధానాలు ఇస్తూ చెలరేగిపోతున్నారు.మొత్తానికి కేటీఆర్ అరెస్ట్ ఐతే పార్టీ నేతలు, క్యాడర్ నైరాశ్యంలోకి వెళ్లకుండా ప్రత్యమ్నాయ మార్గాలతో బీఆర్ఎస్ హైకమాండ్ సిద్ధంగా ఉందని తెలుస్తోంది. ఇక కవితకు స్టీరింగ్ అప్పగిస్తే.. ఎలా డీల్ చేస్తుందనే డైలామా కూడా కొందరు నేతల్లో కనిపిస్తుంది.మరి గులాబీ బాస్ ఏ నిర్ణయం తీసుకుంటారో చూడాలి

10 రోజులు బ్రేక్ కేటీఆర్ కు హైకోర్టులో ఊరట లభించింది. పది రోజుల వరకూ కేటీఆర్ ను అరెస్ట్ చేయవద్దని హైకోర్టు

ఆదేశించింది. కేటీఆర్ పిటిషన్ పై వాదనలు పూర్తయ్యాయి. ఫార్ములా ఈ రేస్ విషయంలో తనపై నమోదయిన కేసును క్వాష్ చేయాలన్న పిటీషన్ పై హైకోర్టులో విచారణ జరిగింది. తమ వాదనలను ఇటు అడ్వకేట్ జనరల్,అటు కేటీఆర్ తరుపున న్యాయవాది వినిపించారు. విదేశీ కంపెనీకు ప్రజాధనం బదిలీ అయిందని ఏజీ తెలిపారు. ఫార్ములా ఈ రేస్ విషయంలో కేటీఆర్ పై తప్పుడు కేసు నమోదయిందని ఆయన తరుపున న్యాయవాది తెలిపారు. ప్రతి విషయంలో ఎఫ్‌ఐఆర్ ఉండదని, విచారణలో నిధులు అందుకున్న కంపెనీపై త్వరలో ఎఫ్‌ఐఆర్ నమోదు చేస్తామని ఏజీ తెలిపారు. రాజకీయ కుట్రలో భాగంగానే కేటీఆర్ పై కేసు నమోదయిందని తెలిపారు. వారం రోజుల వరకూ అరెస్ట్ చేయవద్దని హైకోర్టు ఆదేశించడంతో కేటీఆర్ కు బిగ్ రిలీఫ్ లభించింది. వారం రోజులకు ఈ కేసు విచారణను వాయిదా వేసింది. తిరిగి ఈ నెల 27వ తేదీన విచారణ చేపడతామని తెలిపింది. ఏసీబీకి దర్యాప్తు సహకరించాలని కోరింది. విచారణకు కేటీఆర్ కు సహకరించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ నెల 30వ తేదీలోపు ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని పేర్కొంది.

## 'అల్లుఅర్జున్ సినీ హీరో కావొచ్చు, కానీ

**సంధ్య థియేటర్ ఘటనపై స్పందించిన డీజీపీ**

**వ్యక్తిగతంగా ఎవరికీ వ్యతిరేకం కాదన్న జితేందర్**

**పౌరుల భద్రత కంటే సినిమా ప్రమోషన్ ముఖ్యమైన అంశం కాదని వ్యాఖ్య**





పోలీసులు ఏ వర్గానికి వ్యతిరేకం కాదని, పౌరుల భద్రత తమకు ముఖ్యమని రాష్ట్ర డీజీపీ డా.జితేందర్? తెలిపారు. కరీంనగర్? జిల్లా కొత్తపల్లిలో కొత్తగా నిర్మించిన భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సంధ్య థియేటర్? ఘటనపై డీజీపీ స్పందించారు. తాము ఏ వర్గానికి వ్యతిరేకం కాదని, అల్లు అర్జున్ సినీ హీరో అయినా క్షేత్రస్థాయిలో పరిస్థితులను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమాజంలో శాంతిభద్రతలు ఫరిఢవిల్లాలంటే పౌరులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆయన గుర్తు చేశారు. సినీ ప్రమోషన్ కంటే పౌరుల భద్రత, రక్షణే తమకు ప్రాధాన్యత అని డీజీపీ స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు జరగటం సమాజానికి ఏమాత్రం మంచిది కాదని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం స్త్రీ, పిల్లల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యమిస్తుందని, అందువల్లే ప్రతి జిల్లా కేంద్రంలో భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో 20 ఎస్సీ కార్యాలయాలు, మరో 9 కమిషనరేట్లు

ఉన్నాయని, ఇప్పటి వరకు 27 భరోసా కేంద్రాలను ప్రారంభించినట్లు డీజీపీ చెప్పారు. కరీంనగర్?లో భరోసా కేంద్రాన్ని నిర్మించేందుకు ఎస్?బీఐ సీఎస్?ఆర్? నిధులను వెచ్చించామన్నారు. దాదాపు 6,800 చదరపు అడుగుల భవనాన్ని నిర్మించిందని వివరించారు. "సినిమాల్లో హీరోలైనా బయట మాత్రం పౌరులే. క్షేత్రస్థాయి పరిస్థితులను కూడా తెలుసుకోవాలి. చట్టానికి లోబడి పోలీసు శాఖ పని చేస్తుంది. తప్పు ఎవరు చేసినా కేసులు నమోదు చేస్తాం. పౌరుల రక్షణే మాకు ప్రాధాన్యం. అల్లు అర్జున్‌కు మేం వ్యతిరేకం కాదు. చట్టప్రకారం అల్లు అర్జున్‌పై చర్యలు తీసుకున్నాం.

**మోహన్‌బాబు విషయంలో చట్టప్రకారం చర్యలు :** అంతకుముందు ఐజీ రమా రాజేశ్వరితో కలిసి డీజీపీ భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. పౌరులు భరోసా కేంద్ర సేవలను వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్రంలో నక్సలిజం లేదని తాము భావించడం లేదన్నారు. ఇక్కడి వారు పొరుగు రాష్ట్రాల్లో నాయకత్వం వహిస్తున్నారని తెలిపారు. సినీ నటుడు మోహన్ బాబు విషయంలో చట్ట ప్రకారం నడుచుకుంటామని డీజీపీ జితేందర్? స్పష్టం చేశారు.

## అడుగు దూరంలో 'భూ భారతి బిల్లు'

-మొదటిపేజీ తరువాయి

సెక్షన్లను చట్టంలో చేర్చేందుకు ప్రజాళిక రచించి నిర్ణయించింది. ఆగస్టులో డ్రాఫ్ట్?ను సిద్ధం చేసి వివిధ వర్గాల సలహాలు, అభిప్రాయాలు స్వీకరించారు. ఈ చట్టంపై దాదాపు 11 నెలల పాటు నిపుణులు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్? రెడ్డి పూర్తిస్థాయిలో కసరత్తు చేశారు. చివరికి 21 సెక్షన్లతో డ్రాఫ్ట్?ను సిద్ధం చేయగా.. వాటిలో 19 సెక్షన్లు వివిధ క్లాజులకు సంబంధించినవే. కొత్త అంశాలకూ ఈ చట్టంలో అవకాశం : నూతన రెవెన్యూ చట్టంలో పలు అంశాలను చేర్చాలంటూ అధికార, విపక్ష ఎమ్మెల్యేలు సభలో చర్చలు సందర్భంగా విజ్ఞప్తి చేశారు. అందుకు రెవెన్యూ మంత్రి అంగీకారం తెలిపారు. అలాగే ఆర్వోఆర్?-2024లో కొత్త సెక్షన్లు చేర్చేందుకు ఉన్న ఐచ్ఛికాన్ని సైతం ఏర్పాటు చేశారు. ఇందులో

**జిల్లాల స్థాయిలోనే సమస్యల పరిష్కారం**

రెండు దశల్లో అప్పీళ్ల వ్యవస్థ

ల్యాండ్? ట్రిబ్యునళ్ల ఏర్పాటు

సాదాబైనామాల క్రమబద్ధీకరణ

వారసత్వ బదిలీ మ్యుటేషన్ల సమయంలో విచారణ ప్రక్రియ

ఆబాదీ భూములకు హక్కుల కల్పన

ఇలాంటి తదితర కీలక అంశాలకు కొత్త చట్టంలో స్థానం కల్పించారు. ఈ చట్టం రూపకల్పనలో కీలక భూమిక పోషించిన భూమి చట్టాల నిపుణుడు సునీల్?కుమార్?ను శాసనసభ పలువురు అభినందించారు. గవర్నర్? ఆమోదం లభించగానే భూభారతి చట్టం రూపుదాల్చుకోనుంది.

## అల్లు అర్జున్ వ్యక్తిత్వాన్ని హననం చేసేలా సీఎం వ్యాఖ్యలు

-మొదటిపేజీ తరువాయి

థియేటర్ ఘటనలో మహిళ మరణాన్ని ప్రతి ఒక్కరూ ఖండించారని అన్నారు. శ్రీతేజ్ కోలుకోవాలని ప్రతి ఒక్కరూ కోరుకోవడంతోపాటు అందరూ ఆ కుటుంబానికి బాసటగా నిలిచారని చెప్పారు. సమస్య ముగిసిన తర్వాత అసెంబ్లీలో ఎంఐఎం సభ్యుడితో ప్రశ్న అడిగించుకుని సినిమా లెవల్లో కథ అల్లి మళ్లీ సమస్యను సృష్టించడం సిగ్గు చేటని బండి సంజయ్ కుమార్ అన్నారు. ఎంఐఎంతో కలిసి పక్కా ప్రణాళిక ప్రకారం పవిత్రమైన అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం సినిమా ఇండస్ట్రీని దెబ్బతీసే కుట్ర చేస్తోందని మండిపడ్డారు. ఎంఐఎం బరన్ లెగ్ పార్టీ అని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ పంచన చేరి ఆ పార్టీని నిండా ముంచిందని విమర్శించారు. ఆ పార్టీని నమ్ముకుంటే కాంగ్రెస్‌కు అదే గతి పడుతుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో గురుకులాల్లో విషాహారం తిని విద్యార్థులు మరణిస్తుంటే ఏనాడైనా పరామర్శించారా అని ప్రశ్నించారు. హాస్టళ్లలో పురుగుల అన్నం తిని, పాముకాటుకు గురై నిత్యం చనిపోతుంటే మీరెన్నడైనా బాధ్యత వహించారా అని నిలదీశారు. మీకో న్యాయం.... ఇతరులకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు. ఇకనైనా రేవంత్ రెడ్డి కక్ష సాధింపు చర్యలను వీడాలని హితవు పలికారు. లేనిపక్షంలో బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అల్లుఅర్జున్ ఇంటిపై రాళ్ల దాడి

-మొదటిపేజీ తరువాయి

పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మృతురాలు రేవతి కుటుంబానికి వెంటనే రూ.కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కొందరు నిరసనకారులు అల్లు అర్జున్ నివాసంపై రాళ్లు విసిరారు. ఆయన ఇంట్లోకి నినాదాలు చేసుకుంటూ దూసుకెళ్లేందుకు యత్నించారు. రాళ్లు తగిలి అల్లు అర్జున్ ఇంటి ఆవరణలోని పూల కుండీలు, గార్డెన్‌లోని మొక్కలు ధ్వంసమయ్యాయి. విద్యార్థి సంఘాల ఆందోళన నేపథ్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. నివాసం దగ్గర అదనపు పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులు భారీగా మోహరించారు. ఘటన జరిగిన సమయంలో నటుడు అల్లు అర్జున్ తన నివాసంలో లేరని సమాచారం. విషయం తెలుసుకున్న ఆయన మామ, కాంగ్రెస్ నేత కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి అక్కడికి చేరుకుని ఈ ఘటనపై ఆరా తీస్తున్నారు. జరిగిన రాళ్ల దాడిపై సెక్యూరిటీ సిబ్బంది జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది. సంయమనం పాటించాలి : అల్లు అర్జున్ ఇంటిపై జరిగిన దాడిపై ఆయన తండ్రి అల్లు అరవింద్? స్పందించారు. "మా ఇంటి ముందు జరిగిన ఘటన మీరంతా చూశారు. ఇలా ఎవరికీ జరగకూడదు. ఇలాంటి పరిస్థితుల్లో అందరూ సంయమనం పాటించాలి అదే మంచిది. తొందరపడి చర్యలకు దిగొద్దు" అని అల్లు అరవింద్ తెలిపారు. ఈ రాళ్ల దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారా? అని మీడియా ప్రశ్నకు అల్లు అరవింద్ స్పందించకుండా వెళ్లిపోయారు.

## అల్లు అర్జున్ వెంటనే సీఎంకు క్షమాపణ చెప్పాలి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సినీ నటుడు అల్లు అర్జున్ వెంటనే క్షమాపణ చెప్పాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. సీఎం వ్యాఖ్యలపై ఎదురుదాడిగా తన ఇమేజ్ దెబ్బతీశారంటూ అర్జున్ మాట్లాడటం సరికాదన్నారు. నిన్న సాయంత్రం(శనివారం) జరిగిన ప్రెస్?మీట్?లో అల్లు అర్జున్ చేసిన వ్యాఖ్యలపై కోమటి రెడ్డి స్పందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్?ను పరామర్శించేందుకు లీగల్ టీమ్ ఒప్పుకోలేదనటం హాస్యాస్పదమన్నారు. అసెంబ్లీలో ఈ విషయాన్ని ప్రస్తావిస్తే ఇమేజ్ దెబ్బతిన్నదని అంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇక నుంచి బెనిఫిట్ షోలు ఉండవని కోమటిరెడ్డి?రెడ్డి స్పష్టం చేశారు.

**అల్లు అర్జున్ అన్నమాటలు వెనక్కి తీసుకోవాలి**

మరోవైపు ఇదే అంశంపై పలువురు కాంగ్రెస్ నాయకులు కూడా స్పందించారు. ప్రజా ప్రభుత్వంలో ఎవరు తప్పు చేసినా చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని ఎమ్మెల్సీ బలమూరు వెంకట్ తెలిపారు. అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి సామాన్యులను కష్టపెడితే ఎంతటి వారినైనా వదిలిపెట్టమని ప్రజలకు ధైర్యం, భరోసా కల్పించే ప్రయత్నం చేస్తే స్వాగతించాల్సింది పోయి, వెంటనే సినీ నటుడు అల్లు అర్జున్ ప్రెస్?మీట్ పెట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని బలమూరు వెంకట్ ప్రశ్నించారు.

సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనపై నటుడు అల్లు అర్జున్ ఇప్పటికైనా ఆత్మ పరిశీలన చేసుకుని అన్న మాటలు వెనక్కి తీసుకోవాలని బల్మూరి వెంకట్? డిమాండ్ చేశారు. అల్లు అర్జున్ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఎవరు తప్పు చేసినా ప్రజా ప్రభుత్వంలో న్యాయం, ధర్మం వైపు అండగా నిలవాల్సిన బాధ్యత సీఎంకు ఉంటుందని అదే విషయాన్ని రేవంత్ రెడ్డి స్పష్టమైన వైఖరిని అసెంబ్లీ సమావేశాల్లో తెలియజేస్తే ఆ వెంటనే అర్జున్ మీడియా సమావేశం పెట్టడం సరిగాదని వెంకట్ మండి పడ్డారు.

**అర్జున్ ప్రెస్‌మీట్ పెట్టవలసిన అవసరం ఏమొచ్చింది**

సినీ ప్రముఖులు వ్యాపారం చేసుకుంటే తప్పులేదని, అదే సమయంలో మానవత్వంతో వ్యవహరించాల్సిన అవసరముందని అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ సూచనలు చేస్తే అల్లు అర్జున్ ప్రెస్?మీట్ పెట్టవలసిన అవసరం ఏమొచ్చిందని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ అభిప్రాయపడ్డారు. సీఎం రేవంత్, కాంగ్రెస్ ప్రభుత్వం సినీ పరిశ్రమను ప్రోత్సహిస్తుందని దానిలో భాగంగానే అల్లుఅర్జున్ సినిమాకు టికెట్ రేట్లు పెంచి ఆదుకున్న విషయాన్ని చామల గుర్తుచేశారు.

**అలా అనడం విడ్డూరంగా ఉంది**

'సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటన గురించి సీఎం వాస్తవాలు ప్రజలకు వెల్లడిస్తే హీరో అల్లు అర్జున్ ప్రెస్?మీట్ పెట్టి ఎవరో రాసిచ్చిన నోట్ చదివి వెళ్లిపోయారు తప్ప, బాధ్యతగా వ్యవహరించలేదని' చామల కిరణ్? కుమార్? తెలిపారు. అల్లు అర్జున్ ప్రజలకు ఏం సందేశం చెప్పాలనుకుంటున్నారో కనీస అవగాహన లేకుండా ప్రవర్తిస్తున్నారని చామల విమర్శించారు. ప్రముఖులు థియేటర్‌కు వెళ్లినప్పుడు ప్రజలకు ఇబ్బంది కలగకుండా బాధ్యతగా ఉండాలని సీఎం రేవంత్ చెప్పినప్పుడు హీరోను టార్గెట్ చేస్తున్నారనడం వాలా విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు హీరోలను రియల్ హీరోలుగా అనుకుంటారు కనుక నిజ జీవితంలోనూ సినీ హీరోలు సినిమాలోనే కాదు నిజ జీవితంలోనూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

# సంపాదకీయం

## జమిలితో కొత్త ఎన్నికల వ్యవస్థ

దేశమంతా లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలనే పట్టుదలతో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎట్టకేలకు ఈ ప్రక్రియలో ఒక ముందడుగు వేసింది. డిసెంబర్ 17న జమిలి ఎన్నికలకు సంబంధించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు%-%2024, కేంద్రపాలిత చట్ట సవరణ బిల్లు%-%2024 అనే రెండు ముసాయిదా బిల్లులను లోక్‌సభలో కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టింది. ప్రధాని మోదీ సూచన మేరకు ఈ బిల్లులను సంయుక్త పార్లమెంటరీ కమిటీకి నివేదించనున్నట్లు మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ స్పష్టం చేశారు. దీని ద్వారా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అన్ని భాగస్వామ్య పక్షాలకు అవకాశాలు కల్పించినట్టు అవుతుందనే భావన కేంద్ర ప్రభుత్వ ఆలోచనగా తెలుస్తోంది. అందరూ ఊహించినట్లుగానే ఈ బిల్లులు రాజ్యాంగ మూల స్వరూపానికి భంగం కలిగించేలా ఉన్నాయంటూ ప్రతిపక్షాల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. ప్రభుత్వం మాత్రం ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. ఇవి రాజ్యాంగ మూల స్వరూపానికి, సమాఖ్య వ్యవస్థకు ఎటువంటి భంగం కలిగించవని పేర్కొంది. ఈ సవరణల ద్వారా రాష్ట్రాల అధికారాలను తగ్గించడం లేదా లాగేసుకోవడం జరగదని స్పష్టం చేసింది. జమిలి ఎన్నికలు దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తాయని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనపై జాతీయ స్థాయిలో చర్చ జరగాలి. రాజ్యాంగ సవరణలు కూడా చేయాలి కాబట్టి దీనిపై పార్లమెంట్‌లో కూడా పూర్తిస్థాయిలో చర్చ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒకేసారి ఎన్నికలు జరిగితే జాతీయ స్థాయిలో భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉంటుంది కానీ, ప్రాంతీయ భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉండదనే భయంతో ఈ జమిలి ఎన్నికల విధానాన్ని సహజంగానే కొన్ని పార్టీలు వ్యతిరేకిస్తాయి. అందులోనూ మన దేశంలో ఏ విధానం పైనైనా విభేదాలు తలెత్తగానే పార్టీలు ఆరోగ్యకరమైన చర్చను ప్రోత్సహించే బదులు త్వరపడి ఏకపక్ష నిర్ణయానికి వచ్చేస్తాయి. కీలకమైన అంశాలపై సామరస్య వాతావరణంలో చర్చ జరగడం చాలా అరుదవుతోంది. ప్రత్యర్థుల భావాలను సానుభూతితో అర్థం చేసుకునే ప్రయత్నం గానీ, తమ వాదనను సాక్ష్యాధారాలతో హేతుబద్ధంగా వివరించి ఎక్కువమందిని తమ మార్గం వైపు ఆకర్షింపజేసుకునే ప్రయత్నం గానీ మన సమాజంలో కొరవడుతున్నాయి. దేశమంతా ఒకేసారి ఎన్నికలు అనేది మొత్తం దేశాన్ని ప్రభావితం చేసే అంశం కాబట్టి పార్లమెంట్‌లో పూర్తిస్థాయిలో చర్చ జరగాలి. కేవలం జమిలి ఎన్నికల నిర్వహణ ఆర్థిక భారాన్ని తగ్గించడం కోసమే అయితే అది వృథా ప్రయాసే అవుతుంది. ఈ విధానంపై ఇప్పుడు సర్వత్రా కనిపిస్తున్న ఆసక్తిని మన ఎన్నికల వ్యవస్థను మెరుగుపరిచే సదవకాశంగా వినియోగించుకోవడం అవసరం. ఎన్నికల సంస్కరణలు అనగానే నేర చరితులు, పార్టీల విరాళాలు, సంపన్న అభ్యర్థులు, నల్ల డబ్బుతో ప్రచారం, ఓట్ల కొనుగోలు తదితర అంశాలన్నీ ప్రస్తావనకు వస్తాయి. తరచి చూస్తే ఇవన్నీ ఒకే సంక్షోభానికి బహురూపాలు. ఒకే రోగానికున్న రకరకాల లక్షణాలు అని కూడా చెప్పుకోవచ్చు. నేతలు వ్యక్తిగతంగా అవినీతి చేసినా, పార్టీ గెలుపు కోసం చేసినా ప్రజలకు మాత్రం నష్టంలో తేడా ఏమీ ఉండదు. పోయేది ప్రజల సొమ్మే. మనం చేస్తున్న తప్పిదం ఏమిటంటే.. మనం కోరుకుంటున్న లక్ష్యాల్ని సాధించుకోవడానికి, తగిన వ్యవస్థల్ని నిర్మించుకోవడానికి కావలసిన సంస్కరణల కోసం ప్రయత్నించకపోవడం. మన దేశంలో గత ఏడు దశాబ్దాలుగా ప్రజల సమస్యలు మరింత పెరిగాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజాస్వామ్యం ముసుగులో మన దేశంలో జరిగే ఎన్నికలు... ఒక తంతు మాత్రమే అని మనమంతా ఒప్పుకోక తప్పదు. అటు నేతలు, ఇటు ప్రజలు చెరోదిక్కున సమస్యను పెంచి పోషిస్తూ సంక్షోభం దిశగా వెళ్తున్నారు తప్ప, ఈ విష వలయాన్ని ఛేదించే పరిష్కారాల మీద దృష్టి పెట్టడం లేదు. పేదరికంలో ఉన్నవారు ఈ రాజకీయం ఇంతే, అవినీతిపరులైన నేతల నుంచి దక్కిందే చాలు అన్నట్టు ఓటును వృథా చేస్తున్నారు. ఈ రాజకీయం కుళ్లిపోయింది, ఎవరో దైవదూతలు వస్తే తప్ప మార్పు తేవడం కుదరదు అనుకునే చాలామంది ఆలోచనాపరులు, మధ్యతరగతి వారు ఎన్నికల ప్రక్రియ పట్ల బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారు. అసలు ఈ వ్యవస్థే మంచిది కాదు, దీన్ని పూర్తిగా కూలదోసి మరో వ్యవస్థను తేవాలని మరికొందరు పిడివాదులు భావిస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడా కూడా ఉన్న వ్యవస్థను పూర్తిగా కూలదోసి, దాంతో సంబంధం లేకుండా కొత్త వ్యవస్థ వచ్చి విజయవంతమైన దాఖలాలు లేవు. కాబట్టి గతంలో మన వ్యవస్థలోని మంచిని కొనసాగిస్తూ వినియోగించుకుంటూనే, నూతన వ్యవస్థల నిర్మాణం చేసుకోవాలి. అందుకే ఇప్పుడు ఉన్న ఎన్నికల వ్యవస్థని ప్రక్షాళన చేయాలి. పరిస్థితులు మరింత దిగజారకుండా ఉండాలంటే ఇప్పుడైనా ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలూ కలిసి కొన్ని కఠిన నిర్ణయాలు, కొన్ని సంస్థాగత నిర్ణయాలు తీసుకోక తప్పదు. మొదటిది%-% సమర్థులు, నిజాయితీపరులైన అధికారులను ఎంపికచేసి, వారికి తగిన అధికారాలను, సిబ్బందిని ఇచ్చి వెన్నుతట్టి ప్రోత్సహించడం. రెండవది%-% నేరగాళ్ళను, ముఠా నాయకులను ఎన్నికలకు దూరంగా ఉంచడం. ఆత్మస్తుతి, పరనింద మాని అన్ని రాజకీయ పార్టీలూ ఇకనైనా పరిస్థితిని మార్చడానికి నడుం కట్టాలి. నాలుగు సీట్లు పోయినా ఫర్వాలేదు, మేం మాత్రం మా పద్ధతి మార్చుకుంటున్నాం అని ప్రజలకు ప్రత్యక్షంగా రుజువు చేయగలగాలి. ఇదే సందర్భంలో ధన రాజకీయాలకు లభిస్తున్న తాత్కాలిక ఆదరణను జన రాజకీయంగా భ్రమింపజేయకుండా... సమర్థులు, నిజాయితీపరులు, ముఖ్యంగా యువత నాయకత్వం బాధ్యతల్ని అందుకోవాలి. వారు వీలున్నంతకాలం చేశాక తమ తర్వాతి తరానికి ఆ బాధ్యతల్ని బదిలీ చేసేలా రాజకీయ, పాలనా, ఎన్నికల వ్యవస్థల్ని మార్చే సంస్కరణల్ని తెచ్చుకోవడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయడం ఇప్పుడు ప్రజల ముందున్న ప్రధాన లక్ష్యం. ఎన్నికల విషయంలో ప్రభుత్వాలు, పార్టీలు, ప్రజలు ఈ వాస్తవాల్ని గుర్తిస్తే... ఖచ్చితంగా జమిలి విధానం ఎన్నికల సంస్కరణలో ఒక కీలక ముందడుగు అవుతుంది.

# కాంగ్రెస్ కొర్రీలతో మళ్లీ కొట్లాటలే

అన్నం పెట్టే రైతన్నల కష్టాలు తెలిసినవాడు.. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చినవాడు.. చట్టాలపై అవగాహన కలిగినవాడు.. 'నేను కూడా కాపోన్నే.. నాకు కూడా పొలం ఉన్నది, వ్యవసాయం చేస్త, రైతు కష్టాలు నాకూ తెలుసు' అని కేసీఆర్ తరచూ చెప్తారు. రైతుల కష్టాలను కండ్లారా చూసిన కేసీఆర్ భూ సమస్యలకు శాశ్వత ముగింపు పలికేందుకు పలు సంస్కరణలను తీసుకువచ్చారు. అందులో భాగంగానే భూ వివాదాలకు, బ్రోకర్లు, దళారుల దందాకు చెక్ పెట్టేందుకు, వ్యవసాయ భూములకు భద్రత కల్పించే లక్ష్యంతో నాటి ముఖ్యమంత్రిగా కేసీఆర్ 2020, అక్టోబర్ 29న ధరణి పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. కలెక్టర్‌లు, ఆర్డీఓలు, తహశీల్దార్లు, భూ చట్టాలపై అవగాహన ఉన్న వారందరితో వందల సార్లు చర్చించిన తర్వాత 2020 నూతన ఆర్వోఆర్ చట్టం, ధరణి అనే పోర్టల్‌కు రూపకల్పన చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ధరణి పోర్టల్ ద్వారా వేగంగా పట్టాలు చేతికందిస్తూ, భూ రికార్డులు సైతం భద్రంగా ఉంచుతూ వారిలో భరోసా నింపారు. అంతేకాదు అవినీతికి తావు లేకుండా, పైరవీలు, అవకతవకలకు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయాల్లోనే రిజిస్ట్రేషన్ల సేవలందించారు. భూ వివాదాలు లేకుండా ధరణి తీసుకొచ్చి లక్షల మంది రైతుల సమస్యలను పరిష్కారం చేశారు.

ధరణి సాఫ్ట్‌వేరే దిక్కు

ధరణి వచ్చిన తర్వాతనే రైతుల జీవితాలు కుదుటపడ్డాయి. తమ భూములకొచ్చిన ఢోకా లేదని గుండెపై చేయి వేసి హాయిగా నిద్రపోగలుగు తున్నారు. కానీ, కుట్రపూరితంగా ఆర్థిక నేరాలకు పాల్పడిన సంస్థలకు ధరణిని కట్టబెట్టి రాష్ట్ర భూముల సమాచారాన్ని దేశ సరిహద్దులు దాటించారని అపోహలు కలిగించేలా సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. ధరణి వచ్చిన నాటినుంచి నేటిదాకా సాఫ్ట్‌వేర్ ద్వారా 70 లక్షల రైతుల కోటి 52 లక్షల ఎకరాల భూమిలో ఒక్క ఎకరం కాని, గుంట భూమి కాని ఎలాంటి చిన్న మార్పు కూడా జరగలేదు. రైతులు వేలిముద్ర వేస్తేనే ధరణిలో మార్పులు జరిగాయి తప్ప ఇతరుల ప్రమేయంతో కానీ లేక ధరణి పోర్టల్



కానీ తనకు తానుగా ఎటువంటి మార్పులు చేయలేదనేది వాస్తవం. 70 లక్షల మంది భూ యజమానులైన రైతుల సాక్షిగా ఇది సత్యం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలు, ధరణిపై ఆయన చేస్తున్న వ్యాఖ్యలు దుష్ప్రచారం, అసత్యాలు మాత్రమే. నేడు భూ భారతిలో ఉపయోగిస్తున్న సాఫ్ట్‌వేర్ కేసీఆర్ తెచ్చిన ధరణి సాఫ్ట్‌వేర్ కావడం గమనార్హం. భూ రికార్డుల చరిత్ర: కాకతీయ రాజులు (1163-1323) మొదట అనేక చెరువులు, కాలువలను తవ్వించి వ్యవసాయానికి నీటిపారుదల సౌకర్యం కలిగించిన తర్వాత, రైతులు భూమిలో పంటను మూడేండ్లు ఉచితంగా పండిచుకునేవారు తర్వాత 4వ సంవత్సరం నుంచి రెవెన్యూ సుంకం 1/4 నుంచి 1/2 వరకు వసూలు చేసేవారు. షేర్ షా సూరి (1486-1545) మొట్టమొదటిసారి క్రమపద్ధతిలో భూ సర్వే చేయించారు. రెవెన్యూ సుంకం ఎకరాకు పండిన పంటలో 1/3 లేక 1/4 వంతు వసూలు చేసేవారు. వసూలు కోసం అమ్మిన్, మొగ్దుం, షిక్దర్, పట్వారీ అనే అధికారులను నియమించారు. (1556-1605) షేర్ షా సూరి రెవెన్యూ వ్యవస్థలోని లోపాలను అక్బర్ సవరించి గత పదేండ్ల సగటు పంట దిగుబడిపై రెవెన్యూ సుంకాన్ని వసూలు చేసేవారు. 1880 దశకంలో అప్పటి నిజాం రాష్ట్ర ప్రధానమంత్రి సాలార్ జంగ్ రెవెన్యూ సంస్కరణలను తెచ్చి ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య అనుసంధానంగా ఉండటం కోసం 'వతన్‌దారి' విధానాన్ని ప్రవేశపెట్టారు. అప్పుడే ప్రతి రెవిన్యూ గ్రామంలో కరణం పటేల్ (పట్వారీ), మాలిపటేల్ (నీటి తీరువా, ఇతర పన్నులు), పోలీస్ పటేల్ (శాంతిభద్రతలు) వ్యవస్థను ఏర్పాటుచేశారు. ఈ మూడు వ్యవస్థల వల్ల గ్రామా ల్లో ప్రజలు నానా అవస్థలు పడటం, ఆ వ్యవస్థలపై అనేకమా ర్లు ఉద్యమించటం వంటి అంశాలను మనం చరిత్రలో చదివాం. 'మా భూమి', 'భక్త రామదాసు' చిత్రాల్లో కనులకు కట్టినట్టుగా ఈ వ్యవస్థల దురాక్రమణలను అందరు చూసినవారే.

# అడవుల రక్షణ బాధ్యత ఆదివాసీలదేనా?

దేశ వనరులను కాపాడాల్సిన బాధ్యత కేవలం ఆదివాసులదే కాదు, మిగతా వారిపై కూడా ఉంది. సహజ వనరులను కాపాడే క్రమంలో ఆదివాసీల జీవితాలు బలవుతున్నాయి. బీర్సాముండా, గుండాదర్, కుమ్రం భీం పోరాట ఫలితంగా రాజ్యాంగంలో ఆదివాసీలకు ప్రత్యేక రక్షణ కల్పిస్తూ 1/70, 1996 పేసా, 2006 అటవీ హక్కుల చట్టాలు రూపుదిద్దుకున్నాయి. ఆదివాసీల అభ్యున్నతే వీటి లక్ష్యం. కానీ, పాలకులు ఆ చట్టాలను అమలు చేయడం లేదు. కొద్ది నెలలుగా మధ్య భారతదేశంలో, ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసీల మీద పెద్దఎత్తున అణచివేత కొనసాగుతున్నది. ఆదివాసీ గూడెంల సమీపంలో వందలాది పోలీసు క్యాంపులను ఏర్పాటు చేసి వారిని ఆందోళనకు గురిచేస్తున్నారు. మూలవాసీ బచావో మంచ్ నాయకుడు రఘు మాటల్లో ఈ దేశ వనరులను కాపాడేందుకు ఆదివాసులు చేస్తున్న పోరాటాన్ని మిగతా సమాజం పట్టించుకోవడం లేదు. ఇది ఆదివాసీలకు సంబంధించిన సమస్యగా అందరూ చూస్తున్నారు. 1980 నుంచి మావోయిస్టులు ఆదివాసీ సమాజంలోకి, దండకారణ్యంలోకి ప్రవేశించి అక్కడ జరిగే అమానుషం, ఫారెస్టు వాళ్ల దోపిడీలను అరికట్టడం కోసం కృషి చేశారు. కానీ, 1993లో ప్రత్యేక చట్టం వచ్చాక దండకారణ్యంలోని కోట్లాది విలువైన వనరులపై కార్పొరేట్లు, సామ్రాజ్యవాదులు, పెట్టుబడిదారుల కన్నుపడింది. వనరుల దోపిడీకి ఆదివాసుల భూములను ఆక్రమించేందుకు నాటి నుంచి నేటి వరకు వారు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆదివాసీలకు మావోయిస్టులు మద్దతుగా ఉన్నందుకే 2005లో సల్వాజుడుం మారణ హోమాన్ని సృష్టించారు. ఐదేండ్లలో మూడు వేల గ్రామాలను దగ్ధం చేశారు. 450 మందిని అతి కిరాతకంగా హత్య చేశారు. ఆ క్రమంలోనే ఎర్రబోరు, డోర్నపాలు, కుంట ప్రాంతాల్లో సల్వాజుడుం బేస్ క్యాంప్‌లుగా మార్చి ఒక్కొక్క క్యాంపులో 50 వేలకు పైగా ఆదివాసీలను నిర్బంధించిన స్థితిని మనందరం చూశాం. చివరికి ప్రొఫెసర్ నందిని సుందర్ పోరాటం, జస్టిస్ సుదర్శన్ తీర్పు కారణంగా సల్వాజుడుం రద్దయిందేమో కానీ, దాని మరొక రూపం డీఆర్‌జీ నేటికీ వేటాడుతూనే ఉన్నది.

ఆదివాసీల నిర్బంధంపై మాట్లాడినందుకు సునీత పొట్టం అనే ఆదివాసీ, మూలవాసీ బచావో మంచ్ నాయకురాలిని బలవంతంగా అరెస్టు చేశారు. అదేవిధంగా 2021 నుంచి సిలింగేర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సాయుధ బలగాల క్యాంపులకు వ్యతిరేకంగా మూలవాసీ బచావో మంచ్ అధ్వర్యంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. మరోవైపు ఆదివాసులందరూ మావోయిస్టులేననే దుర్మార్గమైన ప్రచారాన్ని ప్రభుత్వం చేస్తున్నది. ఈ మధ్య జరిగిన ఎన్‌కౌంటర్లు, ఆదివాసీల నిర్బంధంపై మాట్లాడుతున్న హక్కుల నేతలను సైతం పోలీసులు బెదిరిస్తున్నారు. ఆదివాసీల సమస్యల గురించి ఎవరూ మాట్లాడొద్దా?

ఇదే విధంగా సోనిసూరీ అనే ఆదివాసీ హక్కుల కార్యకర్తను నిర్బంధించారు. చనిపోయిన భర్తను చూసేందుకు కూడా ఆమెకు అనుమతి ఇవ్వలేదు. తమ హక్కుల కోసం పోరాడుతున్న యువతను అణచివేస్తున్నారు. దీన్ని అందరూ ఖండించాల్సిన అవసరం ఉన్నది. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర



ప్రభుత్వాల ఆదేశాలతో కగార్ మారణకాండ కొనసాగుతూనే ఉంది. ఆదివాసీల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్ల దోపిడీకి సహకరిస్తున్నాయి. ప్రభుత్వాలే దళారీగా మారి పెట్టుబడిదారులకు సహజ వనరులను అప్పగించడం దారుణం.

2009లో మావోయిస్టు పార్టీ దేశానికి ప్రమాదకరమని అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రకటించారు. చెప్పినట్టే ఏకపక్ష దాడులకు దిగారు. సరిహద్దుల్లో ఉండాల్సిన సాయుధ బలగాలు మధ్యభారతంలోకి ప్రవేశించాయి. అదే ఇప్పుడు ఆపరేషన్ కగార్‌గా మారింది. ఇప్పుడు దంతెవాడ, బస్తర్ ప్రాంతాలతో పాటు బీజాపూర్ జిల్లా కూడా ఇనుప ఖనిజపు పుట్టినిల్లుగా మారింది. ఛత్తీస్‌గఢ్‌లోని ఇనుప ఖనిజ నిల్వలను వెలికితీసేందుకు ఒక స్టీల్ కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం 2005లో ఒప్పందం కుదుర్చుకున్నది. దానికి తోడు నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) ఈ ప్రాంతంలో ఇనుప ఖనిజ నిల్వలను వెలికితీసేందుకు పనిచేస్తున్నది. కంపెనీలతో జరిగిన ఒప్పందాల వల్లనే ప్రభుత్వాలపై ఒత్తిడి పెరుగుతున్నది. తద్వారా ప్రజలను చంపైనా సరే వనరులను అప్పగించాలనే స్థితికి ప్రభుత్వాలు చేరిపోయాయి. ఈ దోపిడీకి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు కొనసాగిస్తున్నందున వాటిని అణచివేసేందుకు అనేక రకాల ఆపరేషన్లు జరుగుతున్నాయి. అందులో భాగంగానే ఆదివాసీ ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతూ 2009లో ఆపరేషన్ గ్రీన్ హంట్, 2017లో ఆపరేషన్ సమాధాన్, నేడు ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసీల హత్యాకాండ కొనసాగుతున్నది. వేలాది మంది ఆదివాసీలు ఎన్‌కౌంటర్ అయ్యారు. ఈ ఏడాది జనవరి 1న బీజాపూర్ జిల్లా ముగ్ధం గ్రామానికి చెందిన 6 నెలల సోడి మంగ్లీతో మొదలైన హత్యాకాండ 275కు చేరింది. తెలంగాణలోనూ సెప్టెంబర్ 5న రఘునాథపాలెంలో ఏడుగురిని హతమార్చారు. డిసెంబర్ 1న ఆరుగురికి విషం పెట్టి మరీ కాల్చిచంపారు. కనీసం ఆ మరణాలపై సత్యశోధన చేయడానికి కూడా ప్రభుత్వాలు అనుమతులు ఇవ్వడం లేదు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ నిషేధిత ప్రాంతంగా మారిపోయింది. హక్కుల సంఘాలకు అనుమతి ఇవ్వడం లేదు. ఎమర్జెన్సీ కాలంలోనూ ఇంతటి దారుణమైన పరిస్థితి లేదు. అందుకే ప్రజలు స్పందించాలని కురుసం శంకర్, రఘు లాంటి మేధావులు కోరుతున్నారు. ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వ అణచివేతలు ఎన్నడికీ విజయవంతం కావు. తెలంగాణ ఉద్యమమే అందుకు నిదర్శనం. మావోయిస్టుల సాకుతో ఆదివాసీలను నిర్బంధిస్తే ఉద్యమాలు ఆగవు. ప్రజాస్వామిక పోరాటాలను నిషేధించిన ప్రభుత్వాలు ఎక్కువ కాలం మనుగడ సాగించవు. పాలించే నైతిక హక్కును పాలకులు కోల్పోతారు. ఈ నేపథ్యంలో ప్రజా ఉద్యమాల పట్ల ప్రభుత్వాలు ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలి. మూలవాసీ బచావో మంచ్‌పై నిషేధం ఎత్తివేయాలి. మరీ ముఖ్యంగా ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని పౌరహక్కుల సంఘం డిమాండ్ చేస్తున్నది.

ఆదివాసీలపై చేస్తున్న హత్యాకాండ పట్ల ప్రజల నుంచి మద్దతు దక్కని పక్షంలోనే ప్రభుత్వాలు అత్యంత దారుణంగా నరమేధాన్ని సృష్టిస్తాయి. ఈ విధానాన్ని మనమంతా ఖండించాలి. దేశ మూలవాసులైన ఆదివాసుల జీవించే హక్కును కాపాడుదాం. ఆపరేషన్ కగార్, ఆదివాసీ హననానికి వ్యతిరేకంగా గొంతెత్తుదాం.

# అల్లు అర్జున్ ప్రెస్ మీట్ పై మంత్రి శ్రీధర్ బాబు మీడియా సమావేశం


**హైదరాబాద్,డిసెంబర్ 22** అల్లు అర్జున్ రోడ్ షో చేశారా లేదా అనేది వీడియో చూస్తే తెలుస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.సంధ్య థియేటర్ ఘటన పై అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు హీరో అల్లు అర్జున్ ప్రెస్ మీట్ పెట్టి వివరణ ఇచ్చిన సంగతి తెలిసిందే.. అనుమతులు ఉన్నందునే తాను థియేటర్ వద్దకు వెళ్లానని, తొక్కిసలాట గురించి థియేటర్ లోపల పోలీసులు ఎవరూ తనతో మాట్లాడ లేదని అల్లు అర్జున్ స్పష్టం చేశారు.అల్లు అర్జున్ ప్రెస్ మీట్ పై తాజాగా తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు.పోలీసులు పర్మిషన్ ఇచ్చారా,లేదా? సంధ్య థియేటర్ వద్ద కారులోంచి లేచి అభిమానులకు అభివాదం చేయడం..తదితర విషయాల్లో వాస్తవాలు ఏంటనేది అల్లు అర్జున్ కు కూడా తెలుసని అన్నారు. సంధ్య థియేటర్ వద్ద అల్లు అర్జున్ రోడ్ షోలో పాల్గొన్నారా!లేదా అనేది వీడియోలు చూస్తే తెలుస్తుందని




స్పష్టం చేశారు.సినీ ప్రముఖులు అల్లు అర్జున్ ను మాత్రమే కాకుండా, బాధిత కుటుంబాన్ని కూడా పరామర్శించాలనేది ముఖ్యమంత్రి ఉద్దేశమని శ్రీధర్ బాబు వివరించారు.

## ఫ్యాన్స్ పేరుతో సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్న వారిపై చర్యలు..

**అల్లు అర్జున్**




**హైదరాబాద్,డిసెంబర్ 22(సూర్యరేఖ)** హైదరాబాద్ ఫ్యాన్స్ ముసుగులో తన పేరుపై సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వారిపై కఠిన చర్యలు ఉంటాయని అల్లు అర్జున్ అన్నారు తన అభిమానులు బాధ్యతాయుతంగా వ్యవరించాలని ఎవరిని వ్యక్తిగతంగా కించపరిచే విధంగా పోస్టులు చేయవద్దని,ఫ్యాన్స్ ముసుగులో గత కొన్ని రోజులుగా ఫేక్ ఐడి ప్రొఫైల్స్ తో పోస్టులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోబడతాయని ఆయన తెలిపారు.నెగిటివ్ పోస్టులు చేస్తున్న వారికి దూరంగా ఉండాలని నా అభిమానులకు సూచిస్తున్నానని ఆయన పోస్ట్ చేశారు.

## బెనిఫిట్ షోలకు సిగ్గు లేకుండా ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది..

**సిపిఐ నేత నారాయణ**




**హైదరాబాద్,డిసెంబర్ 22(సూర్యరేఖ)** పుష్ప 2 బెనిఫిట్ షోలకు తెలంగాణ ప్రభుత్వం మొదట అనుమతులు ఇవ్వడంపై సిపిఐ సీనియర్ నేత నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చనిపోయిన మహిళకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నానని,బూతు స్మగ్లింగ్ కంటెంట్ తో ఉన్న సినిమాను తెలంగాణ ప్రభుత్వం సిగ్గులేకుండా ప్రోత్సహించిందని, టికెట్లు పెంచుకోవడానికి అనుమతులు ఇచ్చిందని,మహిళ చనిపోయిన తర్వాత ముఖ్యమంత్రి గగ్గోలు పెట్టడం సరి అయినది కాదని ఆయన అన్నారు.ఆ సినిమా ఏమన్న సమాజానికి ఉపయోగపడే సినిమానా ప్రభుత్వం అటువంటి సినిమాను ప్రోత్సహించడం చాలా తప్పు అని ఆయన మండిపడ్డారు.ఆ మహిళా చావు కారణమైన వారిని చట్టరీత్యా శిక్షించాల్సిందేనని నారాయణ తెలిపారు.

## దుర్గ అమ్మవారిని దర్శించుకున్న సీతక్క..



**హైదరాబాద్,డిసెంబర్22(సూర్యరేఖ)** దుర్గ అమ్మవారి ఆలయానికి విచ్చేసిన తెలంగాణ మంత్రి సీతక్క దుర్గగుడిలో ఆదివారం ఉదయంప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారి దర్శనార్థం ఆలయమునకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి, స్త్రీ,శిశు సంక్షేమశాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్కకు ఆలయ మర్యాదల తో స్వాగతం పలికిన ఆలయ అధికారులు వేద పండితులు అమ్మవారినీ దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతక్కను వేద పండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రము,ప్రసాదం చిత్రపటం అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు న్యాయవాది గంగశెట్టి అయ్యప్ప తదితరులు ఉన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే మదన్మోహన్.



**కామారెడ్డి,డిసెంబర్ 22(సూర్యరేఖ)** ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్రావు ఆదివారం లింగంపేట మండలం యొక్కపల్లి తండా మాజీ ఎంపీటీసీ మున్యా నాయక్ కుమార్తె వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.అక్కడి నుంచి నాగిరెడ్డిపేట మండలం మెల్లకుంట తండా రమావత్ నిలియా నాయక్ కుమార్తె వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవీందర్ రెడ్డి గారి కుమార్తె నిశ్చితార్థ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు లింగంపేట మండలం నల్లమడుగు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రవీణ్ గారి పిల్లల పుట్టు వెంట్రుకల కార్యక్రమంలో ఎల్లారెడ్డి శాసనసభ్యులు పాల్గొన్నారు మదన్ మోహన్ వెంట ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నేడు నిజాంపేటలో కరెంటు అంతరాయం..




**నిజాంపేట,డిసెంబర్22(సూర్యరేఖ)** మండల కేంద్రంతో పాటు నస్కల్ గ్రామంలోని 33/11 కె.వి సబ్ స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడ నుందని విద్యుత్ ఏఈ గణేష్ ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. నిజాంపేట, నస్కల్ గ్రామాలలోని సబ్ స్టేషన్ లో మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని దీనికి ఇరు గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

## తొక్కిసలాట ఘటన తలుచుకొని కన్నీరు పెట్టుకున్న సిఐ రాజు నాయక్..



**హైదరాబాద్,డిసెంబర్22(సూర్యరేఖ)** సంధ్య థియేటర్ ఘటనలో రేవతిని రక్షించలేకపోయామని సిఐ రాజు నాయక్ స్థానిక పోలీస్ అధికారుల ముందు కన్నీరు పెట్టుకున్నారు. ఆమెను కాపాడలేదనే బాధ తనను ఇంకా వేధిస్తుందని ఆయన కంటతడి పెట్టుకున్నారు. ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న శ్రీ తేజ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నానని ఆయన తెలిపారు అల్లు అర్జున్ టీం నుంచి తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని థియేటర్ యజమాన్యంతో మాత్రమే కాంటాక్ట్ ఉందని ఆయన పేర్కొన్నారు. తాను కూడా తొక్కిసలాటలో చనిపోతానని అనుకున్నట్లు ఆయన చెప్పారు.అంతా పెద్ద ఎత్తున అభిమానులు తరలిరావడం అల్లు అర్జున్ కి మేము పర్మిషన్ ఇవ్వలేదని ఆయన చెప్పారు.


## దారుణంగా మారుతున్న గురుకులాలు

**వరంగల్ :** తెలంగాణ గురుకుపాఠశాలలో పరిస్థితులు దారుణంగా మారుతున్నాయి. మొన్నటి వరకు ఫుడ్ పాయిజన్ ఘటనలు విద్యార్థులను, తల్లిదండ్రులను ఆసుపత్రులకు పరుగుల పెట్టించాయి. ఇప్పుడు మరో సమస్య వారిని వెంటాడుతోంది. విష సర్పాలు కాటేసి చంపుతున్నాయి. ఎలుకలు కొరికి చిత్రవధ చేస్తున్నాయి. మొత్తానికి గురుకుల పాఠశాలలు, హాస్టల్స్‌లో ఉండాలంటే విద్యార్థులు భయపడిపో తున్నారు. జగిత్యాల జిల్లా పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో ఈ మధ్య కాలంలో పాము కాటుకు విద్యార్థులు బలి అవుతున్నారు. యశ్విత్ అనే విద్యార్థికి పాము కాటేసింది. ఇప్పటి వరకు పాఠశాలలో సుమారు ఆరుగురిని పాము కాటు వేసింది. అయిన అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదన్న విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి.

# సిపియుఎస్ఐ 26వ వార్షికోత్సవాలను ఘనంగా జరుపుకుందాం

**రమేష్ ముదిరాజ్..**

**హైదరాబాద్,డిసెంబర్ 22** ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టుపార్టీ, దళిత బహుజన శ్రామిక విముక్తి పార్టీని 1997 డిసెంబర్ 25న డాక్టార్ బీఆర్ అంబేడ్కర్ మను ధర్మశాస్త్రాన్ని దగ్ధంచేసిన రోజున దళితబహుజన ఆశాజ్యోతి కామ్రేడ్ మారోజువీరన్న నాయకత్వంలో సిపియుఎస్ఐ పార్టీని ఏర్పాటుచేసి నేటికీ 26 సంవత్సరాలుకావస్తున్నది.ఈ వార్షికోత్సవాలను ఘనంగా జరుపుకోవాలని సిపి యుఎస్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి రమేష్ ముదిరాజ్ అన్నారు.ఈపార్టీ ఏర్పాటు దశలో గోదావరిలోయ విప్లవ ఉద్యమ రథసారదులు 155 మంది అగ్ర కులబ్రాహ్మణకుల వ్యవస్థను కూల్చి బహుజన జనతా ప్రజాస్వామిక విప్లవంకోసం పనిచేస్తున్న క్రమంలో మేరికల్లాంటీ విప్లవవీరులు యాదన్న, స్వరూపక్క, కంభల్ అనీత,రమేష్ న్న, రంగన్న, గోపన్న, మాలతి,కమల అక్క,సూర్యమన్న, రమేష్, సుధాకర్, సునీత, లక్మణ్,గోరే పరుశరాములు, వీరన్న,ధనసారి సాంబన్న, భీక్షంగుండప్ప, ఇలాఎందరో పార్టీ ఏర్పాటు సమయంలో పోలీసు బూటకపు ఎన్ కౌంటర్లలో అమరులై నారు పోసినవారు.ఈ దేశంలో అణగారినకులాలకు రాజ్యాధికారమే అంతిమంగా పోరాడాల ని మారోజు వీరన్న నేత్రుత్వంలో సిపియుఎస్ఐ పార్టీని ఏర్పా టు చేయడం జరిగింది.సిపియుఎస్ఐ పార్టీ వారోత్సవాలు డిసెంబర్ 25 నుండి 31వరకు పార్టీ అవిర్భావసభలు




రాష్ట్రవ్యాప్తంగా జరుపుకోవాలని రాష్ట్ర కమిటీ పిలుపునివ్వడం జరిగింది. అందులో భాగంగానే సిపియుఎస్ఐ పార్టీ వారోత్స వాలను రాష్ట్రవ్యాప్తంగా ఘణంగా జరుపుకోవాలని,ఈ వారోత్సవాలను విజయవంతం చేయాల న్ని పార్టీ శ్రేణులకు పిలుపునిస్తున్నాం అని సిపియుఎస్ఐ పార్టీ తెలంగాణ రాష్ట్ర సహాయకార్యాదర్శి రమేష్ ముదిరాజ్ అన్నారు.

# పుష్ప ఇంటిపై ఓయు జెఎసి నాయకుల రాళ్లదాడి






**హైదరాబాద్,డిసెంబర్22(సూర్యరేఖ)** హైదరాబాద్ లోని ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఇంటిని ఓయూ జేఏసీ నాయకులు ముట్టడించారు.సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి మరణించిన విషయం తెలిసినదే రేవతి కుటుంబాన్ని ఆదుకోవాలని హాస్పిటల్ వెళ్లి రేవతి కుమారుడుని పరామర్శించాలని వారు నినాదాలు చేశారు.ఇంటి గోడలు ఎక్కి రాళ్లు రువ్వారు.ఆ సమయంలో అల్లు అర్జున్ కుటుంబ సభ్యులు ఎవరు భయంతో బయటికి రాలేదు.ఈ విషయం పోలీసులకు తెలియడంతో వారు ఓయూ జీఏసి నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

# ఆత్మ రక్షణ కోసం కరాటే అవసరం

**గ్రాండ్ మాస్టర్ శ్రీనివాస్**

**నిజాంపేట,డిసెంబర్22(సూర్యరేఖ)** ఆత్మ రక్షణ కోసం ప్రతి ఒక్కరికీ కరాటే ఎంతో అవసరమని గ్రాండ్ మాస్టర్ శ్రీనివాస్ అన్నారు.మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో ఆదివారం ప్రాథమిక పాఠశాల ఆవరణలో గ్రాండ్ మాస్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కుంపు కరాటే ప్రదర్శన నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రస్తుత సమాజంలో విద్యార్థినులకు కరాటే శిక్షణ ఎంతో అవసరమన్నారు. తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని సూచించారు.శరీరం దారుఢ్యం పెంపొందించడంతో పాటు,ఆత్మ రక్షణకు కరాటే ఎంతో అవసరమని తెలిపారు. పిల్లలు కూడా చిన్నప్పటి నుంచే శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. కేవలం చదువే కాకుండా విద్యార్థులను క్రీడల వైపు కూడా తల్లిదండ్రులు ప్రోత్సహిం చాలని కోరారు.చైనీస్ మార్చ ల్యాండ్ అకాడమీ షాలిన్ కుంపులో భాగంగా పిల్లలకు పాఠశాల ఆవరణలో బెల్టు అవార్డింగ్ టెస్ట్ నిర్వహించడం



జరిగిందన్నారు.తమకు తాముగా నమ్మకం కలిగించే విధంగా ఈ కొంపు అవసర పడుతుందన్నారు.పిల్లలు.ఎదుగుదలకు కరాటే ఎంతో అవసరం పడుతుందని,పిల్లలకు అవార్డింగ్ సర్టిఫికెట్లు అందజేశారు.ఈకార్యక్రమంలో స్వామి, శంకర్, సాయి, సురేష్, శివ, ప్రశాంత్, నవీన్ కుమార్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# పటిష్ట భద్రత నడుమ ప్రశాంతంగా ముగిసిన గవర్నర్ పర్యటన




**మెదక్,డిసెంబర్ 22(సూర్యరేఖ)** మెదక్ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పర్యటన పటిష్ట భద్రత నడుమ ప్రశాంతంగా ముగిసింది.గవర్నర్ మొదటగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోకి రాగా జిల్లా ఎస్పీ సాదర స్వాగతం పలికి పూల మొక్కను అందించారు. అనంతరం గవర్నర్ పోలీస్ గౌరవ వందనం స్వీకరించినారు.గవర్నర్ జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పీతో ముచ్చటించారు.మెదక్ చర్చి 100 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా సుప్రసిద్ద మెదక్ చర్చ్ ని సందర్శించి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ప్రార్థనలు ముగించుకొని కొల్చారం మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడ జరిగిన నృత్య ప్రదర్శనను ఆసక్తిగా తిలకించి వారికి ప్రేరణాత్మక ప్రసంగన్ని ఇచ్చారు.తరవాత గవర్నర్ పిల్లలతో కలసి బోజనం చేసి పర్యటనను ముగించుకొని వెళ్లారు.ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రతను జిల్లా ఎస్పీ.డి.ఉదయ్ కుమార్ రెడ్డి బందోబస్తు ఏర్పాట్లు చేశారు.గవర్నర్ పర్యటనను విజయవంతంగా పూర్తి చేసినందుకు సిబ్బందికి జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి అబినందనలు తెలియజేశారు.

# గ్లాండ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో పిల్లుట్ల గ్రామంలో ఉచిత వైద్య శిబిరం





**శివంపేట్,డిసెంబర్22(సూర్యరేఖ)** శివంపేట్ మండలంలోని పిలుట్ల గ్రామంలో గ్లాండ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో విఫర్ ఉమెన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించి గ్రామ ప్రజలకు ఉచితంగా మందుల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ ప్రతిభాలక్ష్మి మాట్లాడుతూ...గ్రామాలలో ఉండే ప్రజలు నిరంతరం మెడికల్ చెకప్ చేసుకుంటూ పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని ఈ సందర్భంగా తెలియజేశారు. గ్రామాలలో ఉండే ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మహిళలకు ఎలాంటి సమస్యలు ఉన్న వారు తమని సంప్రదిస్తే సరైన వైద్యం అందించి వారికి మందులు ఉచితంగా అందజేస్తామని తెలియజేశారు.అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శివ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ. ఈ మెడికల్ క్యాంప్ నిర్వహించడం వలన గ్రామాల్లో ఉండే ప్రజలకు ఉపయోగపడుతుందని ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ప్రతిభాలక్ష్మి,మదన్ మోహన్, అన్నపూర్ణ,రమణి కళాశాల సిబ్బంది కే. సతీష్,ప్రసన్న,దివ్య సంతోష,సంతోష్ ధనరాజ్, లింగం,కుమార్,కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేందుకు యత్నం





**రాజేంద్రనగర్ మండల సిపిఎం పార్టీ నూతన కమిటీ ఎన్నిక..**

**కమిటీ కార్యదర్శిగా జాజాల రుద్రకుమార్**

**రాజేంద్రనగర్,డిసెంబర్22** ప్రభుత్వం కార్మికుల హక్కులను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ,రంగారెడ్డి జిల్లా కార్యదర్శిలు పేర్కొన్నారు.రాజేంద్రనగర్ మండల సిపిఎం పార్టీ మండల మహాసభ సిఐటియు రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో నిర్వహించారు.ఈ సందర్భంగా వారు కాటేదాన్ చౌరస్తా నుంచి సిఐటియు కార్యాలయం వరకు కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు.ఈ సభను సిపిఎం పార్టీ రాజేంద్రనగర్ మండల రెండవ మహాసభ కామ్రేడ్ బి.చిట్టెమ్మ ప్రాంగణం పేరుతో నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ...పెరిగిన ధరలతో పేద,మధ్య తరగతి ప్రజల జీవితాలు నిర్వీర్యం అవుతున్నాయని అన్నారు. ధరలకు అనుగుణంగా కనీస వేతనం అమలు చేయాలని తెలిపారు.దీంతో పాటు పెట్టుబడిదారులు కార్పొరేట్ సంస్థలకు కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ పేద ప్రజల జీవితాలతో ఆటలాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు.

**నూతన కమిటీ ఎన్నిక...**

రాజేంద్రనగర్ మండల సిపిఎం పార్టీ నూతన కమిటీని ఎన్నుకున్నారు.కమిటీ మండల కార్యదర్శి గాజాజాల రుద్రకుమార్,ఎన్నిక కాగా 11 మందితో కమిటీని ఎన్నుకున్నారు.కమిటీ సభ్యులు గా జిఎం కురుమయ్య, జీఎం గట్టయ్య,ఎస్ రామ్మో హన్ రావు, ఎన్ జంగయ్య, ఎస్ మోహన్ భాస్కర్, కాలే రాజు,స్వామి,సువార్త,మణెమ్మలను ఎన్నుకున్నారు.



## గడ్డం వెంకట స్వామి వర్ధంతి సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ జానయ్య ఘన నివాళులు..




**రాజేంద్రనగర్,డిసెంబర్ 22** కేంద్ర మాజీ మంత్రి దివంగత గడ్డం వెంకటస్వామి (కాకా)10వ వర్ధంతి కార్యక్రమాన్ని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ జానయ్య,వెంకట్ స్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ జానయ్య మాట్లాడుతూ. పేదల పక్షపాతి,దళిత జన బాంధవుడు,స్వాతంత్ర సమరయోధుడు,ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారుడు అని కాకాను కొనియాడారు.వెంకటస్వామి తెలుగు ప్రజలకు సుపరిచితమైన వ్యక్తి,కేంద్ర,రాష్ట్రాల్లో అనేక పదవులు చేపట్టారు.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు,బోధనా, బోధనేతర సిబ్బంది,అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు వెంకట స్వామి చిత్రపటానికి నివాళులర్పించారు.

## అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రజలు సంతోషంగా ఉండాలి..


**శబరిమలై తరలిన దీక్షా స్వాములు..**

**బీజేపీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్**



**రాజేంద్రనగర్,డిసెంబర్22** అయ్యప్ప స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని రంగారెడ్డి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ అన్నారు.ఆదివారం రాజేంద్రనగర్ లోని అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు జి.బాబు రావు గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి కట్టుకుని స్వామియే శరణమయ్యప్ప నామస్మరణ చేస్తూ అయ్యప్ప స్వాములు శబరిమలైకి బయలుదేరి వెళ్లారు. వీరికి భక్తులు, మహిళలు మంగళహారతులతో ఘనంగా సాగనంపారు.మొత్తం 16 మంది స్వాములతో కలిసి గురుస్వామి వెళ్లారు.ఈ సందర్భంగా వై.శ్రీధర్ మాట్లాడుతూ. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. స్వాములు యాత్రకు వెళ్లే క్రమంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. భక్తిభావం అలవర్చుకున్నప్పుడే శాంతియుత సమాజం నెలకొంటుందన్నారు.అయ్యప్ప మాలాధారణ దీక్షతో హృదయం పవిత్రంగా మారుతుందని వై.శ్రీధర్ అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువమోర్చా నాయకుడు బాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నూతన జంటను ఆశీర్వదించిన బీఆర్ ఎస్ యువ నాయకుడు పి.కార్తీక్ రెడ్డి

**రాజేంద్రనగర్,డిసెంబర్22(సూర్య రేఖ)** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని ఘాన్సీమియాగూడ ఆమేటి పార్కులో జరిగిన మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి మున్సిపాలిటీ శ్రీరామ కాలనీ బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు సందీప్,మమతల వివాహానికి రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించి నూతన జంటకు శుభాకాంక్షలు తెలిపారు.కార్తీక్ రెడ్డి వెంట నూతన వధూవరులను ఆశీర్వదించిన వారిలో రాజేంద్రనగర్ నియోజకవర్గం సీనియర్ నాయకులు డి.రమేష్ ముదిరాజ్,బి.సతీష్ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

సూర్య



# అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలి





**కేంద్ర ప్రభుత్వం అమిత్ షాను బర్తరఫ్ చేయాలి..**

**జాతీయ షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ రంగారెడ్డి**

**జిల్లా స్థాయి అధ్యక్షులు దాసరి రమేష్**

**రాజేంద్రనగర్,డిసెంబర్22** కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కించపరచడం బాధకరమని జాతీయ షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ రంగారెడ్డి జిల్లా స్థాయి అధ్యక్షులు దాసరి రమేష్ అన్నారు. అంబేద్కర్ పార్లమెంట్ లో అపహాస్యం చేసేలా మాట్లాడటం ఏంటని ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం కమిటీ సమావేశాన్ని బుద్వేల్ అంబేద్కర్ యూత్ కమిటీ హాలులో దాసరి రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. భారతరత్న అంబేద్కర్ విగ్రహానిగకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాసరి రమేష్ మాట్లాడుతూ. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి అమిత్ షా అంబేద్కర్ ను కించపరచినందుకు తాను క్షమాపణ చెప్పాలని అన్నారు. వెంటనే కేంద్రమంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని అన్నారు. ఏఐఎస్సీ ఆర్పీఎస్ జాతీయ స్థాయి సమావేశాన్ని రాజేంద్రనగర్ సర్కిల్లో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశానికి అధ్యక్షులు దళితరత్న రాజు ఉస్తాద్ ఆధ్వర్యంలో నిర్వహించాలని తెలిపారు. సభ్యుల చేత అసోసియేషన్ ముఖ్య సలహాదారు డాక్టర్ వేము వందనం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీశైలం, వందన, పచ్చ శ్రీనివాస్, ఎమ్ సి వీరన్న,టి.అశోక్ కుమార్,ఎం. శివకుమార్, సాయ్ కృష్ణ,వై.కిరణ్ కుమార్,ఇ. కన్నయ్య, నవీన్ కుమార్, వై.నందరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## బాలికలకు రెసిడెన్షియల్ స్కూల్స్ బంగారు భవిష్యత్ ను ఇవ్వాలని మనసారా కోరుతున్నా












**మంచి సంస్కృతి సాంప్రదాయాలతో సమాజంలో పౌరుడిగా ఎదిగాలి..**

**కన్న కలలు సాకరమయ్యేందుకు విద్యార్థినిలు నిరంతరం శ్రమించాలి..**

**తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ**

**కొల్చారం,డిసెంబర్22(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మెదక్ జిల్లాలో ఆదివారం పర్యటించి కుల్చారం మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర బాలికల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల,జూనియర్ కళాశాల విద్యార్థినిలతో ఏర్పాటు చేసిన ముఖాముఖి చర్చా కార్యక్రమంలో అధికారులు,ప్రజాప్రతినిధులుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ను కళాశాల విద్యార్థినులు గౌరవ వందనంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని జ్యోతిప్రజ్వలన గావించించి సభా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు విభిన్న సంస్కృతి సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు ప్రదర్శించారు. తదనంతరం విద్యార్థినులు వేసిన పలు ప్రశ్నలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సమాధానాలు ఇచ్చారు. క్రీడలలో బ్యాడ్మింటిన్ క్రీడ అంటే ఇష్టమని, భారత మాజీ ఉప రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ తనకు ఆదర్శమని,నిరంతరం చదవడం,రాయడంపైనే ఆసక్తి చూపుతానని, పుస్తకాలే తన నేస్తమన్నారు. అంతకంటే ఎక్కువగా పిల్లలతో గడపడం మరింత ఇష్టంమన్నారు. చిన్నారులు చక్కని ప్రశ్నలు వేశారని,అవి తనను ఎంతో ఆనందింప జేశాయన్నారు. దేశ భవిష్యత్తుకు పునాదిలాంటి వారని,సమస్యలను అధిగమిస్తూ లక్ష్యాలను సాధించాలన్నారు. విద్యాలయాలు దేవాలయాలతో సమానమని, చిన్నతనం నుండే క్రమశిక్షణతో మెసలుతూమంచి నాగరికత పుణికి పుచ్చుకొని భవిష్యత్ కు మార్గ నిర్దేశనం చేసుకోవాలన్నారు. మెదక్ పార్లమెంటు సభ్యుడు రఘునందన్ రావు మాట్లాడుతూ. దేశప్రగతి విద్యార్థుల తరగతిగదులలోనే అని స్వామి వివేకానంద అన్నట్లు చెబుతూ విద్యను ఇష్టతతో అభ్యసించాలన్నారు. విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడుతున్న రెసిడెన్షియల్ పాఠశాలల లక్ష్యాలను ప్రశంసించారు. నర్సాపూర్ శాసనసభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ. విద్యార్థినులు భిన్న సంస్కృతులను మేళవిస్తూ ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయన్నారు. పట్టుదల, క్రమశిక్షణతో ఉన్నత స్థానానికి ఎదగాలని అనుకున్న విద్యార్థులకు రెసిడెన్షియల్ పాఠశాలలు పునాది లాంటివని, తప్పనిసరిగా అనుకున్న లక్ష్యాలను సాధించ గలుగుతారన్నారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను ఘనంగా సన్మానించారు. అనంతరం రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపుల్ సెక్రటరీ దాన కిషోర్,జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్,ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి,రెసిడెన్షియల్ స్కూల్స్ సెక్రెటరీ అలుగు వర్షిణి అదనపు కలెక్టర్ నగేష్,ఆర్డీవో మహిపాల్ రెడ్డి, తాహసిల్దార్ గఫర్, డిప్యూటీ తాహసిల్దార్ నాగవర్ధన్, ఎంపీడీవో కృష్ణవేణి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద వధువుకు పుస్తెమెట్టెలు అందజేత



**రామాయంపేట,డిసెంబర్22(సూర్య రేఖ)** రామాయంపేట మున్సిపాలిటీ పట్టణానికి చెందిన ఊర రమా,గంగారాం దంపతుల ప్రథమ కుమార్తె నిరుపేద వధువు ప్రణవి వివాహానికి స్థానిక ప్రముఖ సంఘ సేవకులు ఎర్రం ఆంజనేయులు దంపతులు ఆదివారం పుస్తెమెట్టెలను అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇప్పటి వరకు నిరుపేద వధువులకు తాను 117 మందికి పుస్తెమెట్టెలను అందజేసినట్లు ఆయన తెలిపారు. నిరుపేద వధువులు ఎవరైనా ఉన్నట్లయితే తమను సంప్రదిస్తే ఉచితంగా పుస్తెమెట్టెలను తాను అందజేస్తానని ఆయన పేర్కొన్నారు. దేవుని దయ ఉంటే మా తల్లిదండ్రుల ఆశీర్వాదంతో ఇంకా మరెన్నో సేవ కార్యక్రమాలు చేయుటకు తాను ముందుకు వెళ్తానని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవుని నర్సింలు,గొల్ల రమేష్,పోచమ్మల ప్రసాద్,మున్నూరు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధుల సన్మానం



**రామాయంపేట,డిసెంబర్22(సూర్య రేఖ)** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆదివారం మెదక్ జిల్లాలో పర్యటించారు. గవర్నర్ రాజ్ భవన్ నుంచి నేరుగా రోడ్డు మార్గం ద్వారా మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఉదయం 11 గంటల ప్రాంతంలో చేరుకున్నారు. ఆయనకు ఉన్నతాధికారులు,ప్రజా ప్రతినిధులతో పాటు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ రాజశేఖర్ రెడ్డి,వైస్ చైర్మన్ పి లక్ష్మణ్ యాదవ్,ప్రధాన కార్యదర్శి సుభాష్ చంద్రబోస్,కోశాధికారి డిజి.శ్రీనివాస శర్మ,కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ, వేణుతోపాటు పలువురు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. గవర్నర్ కు రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు పుష్పగుచ్ఛమిచ్చి శాలువాతో స్వాగతం పలికారు.

## ప్రజలకు మెరుగైన విద్య వైద్యం అందుబాటులోకి తెస్తాం

**దామోదర రాజనర్సింహా**




**కామారెడ్డి,డిసెంబర్22(సూర్య రేఖ)** ప్రజలకు మెరుగైన విద్య వైద్యం అందుబాటులోకి తెస్తూ,సామాజిక భద్రత కల్పించడమే కాంగ్రెస్ పార్టీ ఉద్దేశ్యమని తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రెంజల్ మండల కేంద్రంలోని రూ. 1.56 కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించారు. ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ..ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య,వైద్యం సామాజిక భద్రతను ప్రజలకు కల్పించాలని,ప్రధాన లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గ నిర్దేశంలో ముందుకు వెళ్తున్నామని అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. ఐదు లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు పెంచుతూ అనేక రకాల చికిత్సలను కొత్తగా ఆరోగ్యశ్రీ జాబితాలో చేర్చడం జరిగిందని మంత్రి అన్నారు. అదనపు డెబోరేటరీలను ఏర్పాటు చేస్తూ డ్రగ్ ఇన్ ఇన్స్పెక్టర్లు ఫుడ్ ఇన్స్పెక్టర్లను నూతనంగా నియమిస్తున్నామని ఆయన వివరించారు. అవసరం అయిన చోట ఐవిఏఎఫ్ సెంటర్ లను కూడా నెలకొల్పుతున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ప్రజా సంక్షేమం వారి ఆరోగ్య భద్రతే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని,తమ ప్రభుత్వానికి ప్రజలు అండదండగా నిలవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ,శాసనసభ్యులు సుదర్శన్ రెడ్డి,భూపతిరెడ్డి,రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి,రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ సభ్యులు గడుగు గంగాధర్,సుడా చైర్మన్ కేశవేణు,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా ఇరుముడి కార్యక్రమం..

**శబరికి అయ్యప్ప సన్నిధికి తరలిన అయ్యప్ప స్వాములు**






**నిజాంపేట,డిసెంబర్22(సూర్యరేఖ)** మండల కేంద్రంలో అయ్యప్ప స్వాములు 41 రోజుల పాటు మాలాధారణ స్వాములు కటోర ఉపవాస దీక్షలు చేసి ఆదివారం స్థానిక హనుమాన్ దేవాలయంలో ఇరుముడి కార్యక్రమాన్ని గురుస్వాములు రెడ్డి శెట్టి రవీందర్,భీమయ్య,ల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు మాట్లాడుతూ...గ్రామంలో 40 మంది అయ్యప్ప స్వాములు మాలధరణ ధరించామని భక్తిశ్రద్ధలతో ఇరుముడి కట్టుకుని అయ్యప్ప ఆలయ శబరికి బయలుదేరామన్నారు. ఇరుముడి కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు కాకుండా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని వారికి స్వామివారి కృపా కటాక్షాలు ఉండాలన్నారు. అలాగే అయ్యప్ప స్వాములకు అన్నదాన ప్రసాద దాతగా కల్వకుంట సదాశివ ఇండస్ట్రీ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. అయ్యప్ప స్వాములు ఇరుముడి కట్టుకొని గ్రామ పూరవీధుల గుండా అయ్యప్ప స్వామి భజన సంకీర్తనలతో శోభాయాత్రగా బయలుదేరారు. గ్రామంలో అయ్యప్ప సంకీర్తనలతో మారుమోగాయి. ఈ కార్యక్రమంలో అయ్యప్ప గురు స్వాములు తాజా మాజీ ఎంపీపీ దేశెట్టి సిద్ధ రాములు,వీరమల్లు బాలయ్య నాయిని వెంకటేశం,యాద గౌడ్,రంజిత్ గౌడ్,నవీన్ రెడ్డి,ధనంజయ,రమణ,రాజిరెడ్డి, వెంకటేష్ గౌడ్,నంద్యాల బాల్ రెడ్డి,నవీన్ గౌడ్,నరేష్ గౌడ్,మావురం రాజు,వెంకటరెడ్డి చంద్రకాంత్ నాయిని మహేష్, లక్ష్మణ్,రాములుగౌడ్,వెల్దుర్తి శ్రీకాంత్ గౌడ్,నగేష్,నాయిని శ్రీనివాస్,ప్రసాద్,బజారు తిరుమలగౌడ్,ప్రశాంత్ గౌడ్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నప్పటి నుంచే క్రీడా పోటీలలో విద్యార్థులు పాల్గొనాలి





**విజయవంతంగా రంగారెడ్డి జిల్లా అత్యపత్యా సెలెక్షన్స్..**
**రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభాకర్,**
**బుద్వేల్ ఆదర్శ విద్యాలయ పాఠశాల ప్రిన్సిపాల్ సునంద విజయ్ కుమార్**


**రాజేంద్రనగర్,డిసెంబర్22** చిన్నప్పటి నుంచే క్రీడా పోటీలలో విద్యార్థులు పాల్గొనాలని రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభాకర్,బుద్వేల్ ఆదర్శ విద్యాలయ పాఠశాల ప్రిన్సిపాల్ సునంద విజయ్ కుమార్ లు అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని చేపట్టిన చీఫ్ మినిస్టర్స్ కప్ 2024 భాగంగా ఈ నెల డిసెంబర్ 27 నుండి 29 వరకు సరూర్ నగర్ లో జరగబోయే రాష్ట్ర స్థాయి అత్య పత్య జూనియర్స్ క్రీడలను నిర్వహించనున్న నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా ఆత్యాపాత్య క్రీడా సెలెక్షన్ ట్రయల్స్ ఆదర్శ విద్యాలయ బుద్వేల్ లో జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల ప్రిన్సిపాల్ సునంద విజయ్ కుమార్ పాల్గొని సెలక్షన్ ట్రైల్స్ ను ప్రారంభించారు.విశిష్ట అతిథులు అమర్ సింగ్ హైదరాబాద్ సెక్రెటరీ (అత్య పత్య అంతర్జాతీయ క్రీడాకారుడు) పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఇందులో వివిధ మండలాల నుంచి 107 బాలబాలికలు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారని తెలిపారు.బాలుర విభాగంలో ప్రజ్వల్, సతీష్, చందు, వినయ్,రాజ్ కుమార్,నిహాంత్, జాను, అహ్మద్, విశాల్, హర్ష, శివ,రాఘవేందర్,విశ్రుత్,రోహిత్ ఎంపికయ్యారన్నారు. బాలికల విభాగంలో సుమన, నిహారిక,నికిత,డింపుల్ తక్, శివాని, విష్ణుప్రియ, యశస్విని, రత్న, ఆకృతి, అక్షయ, అంజలి,నందిని,శాలినిలు ఎంపికయ్యారన్నారు. ఇలాంటి పోటీల్లో పాల్గొంటూ దశలవారిగా ఎదుగుతూ అన్ని పోటీల్లో గెలుపొందాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి అసోసియేషన్ మెంబర్స్ మండల మహేందర్, గద్వాల చైతన్య,డి.నవనీత్,సీతారాం జెర్పుల, నీలేష్,ఏ.శేఖర్,చాకలి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.


# కన్నుల పండుగగా అయ్యప్ప స్వామి మహాపడిపూజ

**అయ్యప్ప స్వామి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలి..**
**బీఆర్ఎస్ యువ నాయకుడు పి.కార్తీక్ రెడ్డి**

**రాజేంద్రనగర్,డిసెంబర్22** స్వామియే శరణమయ్యప్ప. హరి హరి వాసనే. శరణమయ్యప్ప అంటూ వేలాదిమంది అయ్యప్ప స్వాముల శరణు ఘోషతో శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రాళ్లగూడ గ్రామంలో మార్మోగింది. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రాళ్లగూడ గ్రామంలో విజయ్ నాయక్ గురుస్వామి నిర్వహించిన అయ్యప్పస్వామి మహా పడిపూజ కార్యక్రమానికి,వివిధ వివాహ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా శ్రీ విఘ్నేశ్వర,శ్రీ సుబ్రమణ్యస్వామి,శ్రీ అయ్యప్ప పడిపూజలో అయ్యప్ప ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకించి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం స్వామికి వివిధ రకాల పూలతో పుష్పార్చన చేశారు.

**గురుస్వాములు భజన పాటలతో అక్కడి ప్రాంగణం స్వామివారి నామస్మరణతో మారుమ్రోగింది.**





అయ్యప్ప స్వాముల పేటతుళ్ళి భక్తులను ఆకట్టుకుంది. అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో పట్లోళ్ల కార్తీక్ రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. అయ్యప్ప స్వామి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి డైరెక్టర్ మల్కారం పిఎసిఎస్ చైర్మన్ బుర్కుంట సతీష్,నార్సింగి మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ మాచర్ల శ్రీనివాస్,డిసిసిబి కో-ఆప్షన్ సభ్యులు మంచర్ల మోహన్ రావు,అర్బినగర్ కౌన్సిలర్ కొనమల్ల శ్రీనివాస్,బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి హనుమంత్, శంషాబాద్ మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చిన్నగండు రాజేందర్ చరణ్, రమేష్, భాస్కర్, కొమ్ము జంగారావు, లింగం,శ్రీశైలం,మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### సినిమాలోనే కాదు.. నిజ జీవితంలోనూ బాధ్యతగా ఉండు..

# అల్లు అర్జున్‌కు భువనగిరి ఎంపీ చురకలు





**హైదరాబాద్:** సంధ్యా థియేటర్ తొక్కిసలాట ఘటనలో తన వ్యక్తిత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ హీరో అల్లు అర్జున్ చేసిన వ్యాఖ్యలపై భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి (%వీ ఖఅతీఖఅ ఎబఖితీ =వ.ఎ.ఎ%) స్పందించారు. అల్లు అర్జున్ మానవత్వం మరిచినట్లుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరో రాసిన నోట్‌ను ప్రెస్‌మీట్‌లో చదివారని విమర్శించారు. అందులో ఉన్నది చదవడం విడ్డూరంగా ఉందన్నారు. అల్లు అర్జున్ నిజ జీవితంలోనూ నటిస్తున్నట్లే ఉందని మండిపడ్డారు. ఆయన నటించిన సినిమాకు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి అండగా ఉండి రేట్లు పెంచారని చెప్పారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి వాస్తవాలు చెప్పారని తెలిపారు. సినిమాలోనే కాదు.. నిజ జీవితంలోనూ బాధ్యతగా ఉండాలంటూ బన్నీకి చురకలంటించారు. థియేటర్‌లో ఒక తల్లి చనిపోయినా కూడా మానవత్వం లేకుండా రూఫ్‌టాప్ ఓపెన్ చేసి చేతులు ఊపుకుంటూ వెళ్లిపోయిన ఆ హీరో ఏం మనిషి..? మృత్యువుతో పోరాడుతున్న బాలుడిని ఆ హీరోనే కాదంటూ అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అయితే పోలీసుల అనుమతి లేకుండానే థియేటర్‌కు వెళ్లి, రోడ్‌షో, ర్యాలీ నిర్వహించినట్టు వస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవమని అల్లు అర్జున్ శనివారం స్పష్టంచేశారు. పోలీసుల అనుమతి తీసుకున్నామని థియేటర్ యాజమాన్యం చెబితేనే అక్కడికి వెళ్లానని తెలిపారు. శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యల తర్వాత రాత్రి 8గంటల సమయంలో హైదరాబాద్‌లోని తన నివాసంలో అల్లు అర్జున్ మీడియా సమావేశం నిర్వహించారు. ఎక్కడా ముఖ్యమంత్రి పేరు ప్రస్తావించకుండానే ఆయన చేసిన ఆరోపణలకు సమాధానం ఇచ్చారు. తొక్కిసలాట ఘటనలో తన వ్యక్తిత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. థియేటర్ వద్ద జరిగిన ఘటన చాలా దురదృష్టకరమన్నారు. బాధిత కుటుంబానికి సానుభూతి తెలియజేస్తున్నానని, చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. థియేటర్ పరిసరాల్లో ఎలాంటి రోడ్‌షో నిర్వహించలేదని అల్లు అర్జున్ తెలిపారు. తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన విషయం తనకు మరుసటి రోజు వరకు తెలియదని చెప్పారు. తనపై కేసు నమోదు కావడం వల్ల నేరుగా వెళ్లి బాధిత కుటుంబాన్ని కలవలేకపోయానని తెలిపారు. 'థియేటర్ వాళ్లు పర్మిషన్ తీసుకున్నామని చెబితేనే నేను అక్కడకు వెళ్లాను. పోలీసులే అక్కడకు వచ్చిన జనాల్ని నియంత్రిస్తూ నా కారు లోపలికి వెళ్లేలా చూశారు. పోలీసులు అక్కడకు వచ్చారంటే పర్మిషన్ ఇచ్చినట్టే కదా! అభిమానులు చుట్టుముట్టడంతో నా కారు ముందుకు కదల్లేదు. నేను అభివాదం చేస్తే రద్దీ క్లియర్ అవుతుందని పోలీసులు చెప్పడంతోనే చేయి ఊపుతూ ముందుకెళ్లాను' అని అల్లు అర్జున్ చెప్పారు. సినిమా చూస్తున్నప్పుడు పోలీసు అధికారులెవ్వరూ తనను కలవలేదని, థియేటర్ యాజమాన్యం వచ్చి బయట రద్దీ పెరుగుతున్నదని చెబితే తాను బయటకు వచ్చానని తెలిపారు.

## ఫార్ములా కేసులో ఈడీ ఎంట్రీ

**హైదరాబాద్ :** తెలంగాణ మాజీ ముఖ్యమైన మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మెడకు ఫార్ములా ఈ ? కార్ రేసు కేసు ఉచ్చు బిగుస్తున్నట్లు కనిపిస్తోంది. విచారణకు గవర్నర్ అనుమతి ఇచ్చిన వారం వ్యవధిలోనే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కేసు నమోదుకు ఆదేశించారు. ఈమేరకు రంగంలోకి దిగిన ఏసీబీ కేటీఆర్‌తోపాటు, అరవింద్‌కుమార్, నర్సింహారెడ్డిని వరుసగా ఏ1, ఏ2, ఏ3గా చేరుస్తూ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఎఫ్ఐఆర్ నమోదైన కొన్ని గంటలకే కేటీఆర్ న్యాయస్థానం తలుపు తట్టారు. తనపై తప్పుడు కేసు నమోదు చేశారని, తనపై పెట్టిన సెక్షన్లు వర్తించవని, ఎఫ్ఐఆర్ క్యాష్ చేయాలని కోరారు. అయితే పటిషన్ ఇంకా విచారణకు రాలేదు. ఏసీబీ మాత్రం అక్రమంగా నగదు బదిలీ చేశారని, ప్రభుత్వం అనుమతి తీసుకోలేదని, ఈ నిధులు ఎక్కడికి వెళ్లాయో తేల్చాల్సిందని నమోదు చేసింది.రాష్ట్రంలో ఫార్ములా ఈ రేసు కేసుపై ఏసీబీ విచారణ మొదలు కూడా కాకముందే.. కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగింది. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన కొన్ని గంటల వ్యవధిలోనే ఈడీ ఎంటర్ కావడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. మరోవైపు కేటీఆర్ పిటిషన్ శుక్రవారం(డిసెంబర్ 20న) విచారణకు వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. లంచ్‌మోషన్ పటిషనే అయినా.. విచారణ జరిగే అవకాశం లేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈడీ కూడా ఎంటర్ కావడం, ఎఫ్ఐఆర్‌తోపాటు, డాక్యుమెంట్లు ఇవ్వాలని ఏఈసబీకి లేఖ రాసింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు కే టీఆర్‌పై రెండు సంస్థలు దర్యాప్తు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.కేసీఆర్ కుటుంబానికి కేంద్ర దర్యాప్తు సంస్థలు అంటే వణుకే. ఎందుకంటే.. గతంలో అధికారంలో ఉన్నప్పుడు కేంద్ర దర్యాప్తు సంస్థలు అయిన సీబీఐ, ఈడీ రాష్ట్రంలోకి రాకుండా జీవో జారీ చేశారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కవిత పేరు రావడంతో తన కూతురును కాపాడుకునేందుకు రహస్యంగా జీవో జారీ చేశారు. కానీ, ఈడీ ఢిల్లీలో నమోదైన కేసు విషయంలో నేరుగా కవిత ఇంటికి వచ్చింది. అరెస్టు చేసి ఢిల్లీకి తీసుకెళ్లింది. ప్రస్తుతం ప్రభుత్వం మారింది. ఇప్పుడు దర్యాప్తు సంస్థలకు ఎలాంటి నిషేధం లేదు. దీంతో కేటీఈఆర్ విషయంలో అవి దూకుడు ప్రదర్శిస్తే అరెస్టు తప్పదని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

## భూ భారతిలో కీలక సూచనలు




**హైదరాబాద్ :** తెలంగాణ భూ భారతి – 2024 బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. దీంతో రాష్ట్రంలో కొత్త రెవెన్యూ చట్టం అమల్లోకి రానుంది. ఇప్పటి వరకు ఉన్న ధరణి స్థానంలో? ఇకపై భూ భారతి రానుంది. కొత్త చట్టంలో కీలక అంశాలు ఉన్నాయి.తెలంగాణ అసెంబ్లీ సమావేశాల వేళ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి బిల్లుకు సభ ఆమోదముద్ర వేసింది. అర్వోఆర్–2020ను కూడా పూర్తిగా ప్రక్షాళన చేస్తూ? కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. ఇకపై రాష్ట్రంలో ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి చట్టం అమల్లోకి రానుంది. ప్రస్తుతం ఉన్న ధరణి రికార్డులను పూర్తిగా ప్రక్షాళన చేయనున్నారు. కొత్త చట్టం కింద రికార్డులను నమోదు చేస్తారు. గతంలో రద్దు చేసిన అనుభవదారుడి కాలమ్ ను మళ్లీ తీసుకురానున్నారు. అనుభవదారుడికి ఈ చట్టం రక్షణగా నిలువనుంది. దీంతో చాలా మంది రైతులకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంటుందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు.తప్పులను సవరణతో పాటు పాస్ పుసక్తాలు రాని వాళ్ల సమస్యలను సత్వరమే పరిష్కరించనున్నారు. ఇందుకోసం తహశీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్లకు అధికారం ఉండనుంది. రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత వెనువెంటనే మ్యుటేషన్ జరిగి పాస్ పుస్తకం వస్తుంది.కొత్త చట్టం ప్రకారం మ్యుటేషన్కు మ్యాప్ తప్పనిసరిగా ఉంటుంది. వారసత్వ భూముల విషయంలో తప్పులు జరగకుండా చర్యలు చేపట్టారు. క్షేత్రస్థాయి విచారణ తర్వాతే? ప్రక్రియ ముందుకు సాగుతుంది. నిర్ణీత కాలంలో విచారణ చేసిన తర్వాతనే పాస్ పుస్తకాలు జారీ అవుతాయి.చాలా ఏళ్లుగా 38ఇ, ఓఆర్‌సీ, లావణి పట్టా వంటి భూముల సమస్యలు ఉన్నాయి. వీటికి పాస్ పుసక్తాలు కూడా లేవు. అయితే కొత్త చట్టం ప్రకారం పాస్ బుక్ లు జారీ అవుతాయి. ఆర్డీవో ద్వారా ఇచ్చే అవకాశం ఈ చట్టం కల్పిస్తుంది. అంతేకాకుండా? గ్రామకంఠం, ఆబాదీలపై కూడా హక్కులు దక్కనున్నాయి. భూ సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో రెండెంచెల అప్పీల్ వ్యవస్థ ఏర్పాటు కానుంది.భూ–భారతితో ఎవరైనా ఎక్కడి నుంచైనా భూముల వివరాలను చూసుకునేలా డిస్‌ప్లే చేస్తారు. గతంలో ఉన్న 33 మూడ్యూళ్లు కాకుండా.. ఆరు మాడ్యూళ్లు మాత్రమే అందుబాటులో ఉంటాయి. ప్రతి భూకమతానికి భూ ఆధార్ ఉండనుంది. హక్కుల బదలాయింపు జరగ్గానే గ్రామ పహాణీలో నమోదయ్యేలా చర్యలు తీసుకుంటారు. 2014 జూన్ 2 ముందుకు జరిగిన సాదా బైనామాలను కూడా క్రమబద్ధీకరించనున్నారు. భూ సమస్యలు ఉన్న రైతులకు ఉచితంగా న్యాయ సలహాలు ఇచ్చేలా కొత్త చట్టంలో రూపకల్పన చేశారు.ఈ బిల్లుపై మాట్లాడిన బీజేపీ, ఎంఐఎం, సీపీఐ.. పలు సవరణను సూచించింది. దీనిపై కూడా చర్చించి? మార్పులపై ప్రకటన చేస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభలో చెప్పారు.

## గులాబీ ముళ్లేనా..

## నేతలను చుట్టుముడుతున్న కేసులు

**హైదరాబాద్ :** అధికారం కోల్పోయిన తర్వాత తొలి ఏడాది బీఆర్ఎస్ పార్టీకి ప్రశాంతంగా గడిచి పోయింది. కేవలం ఢిల్లీ లిక్కర్ కేసు తప్పితే పెద్దగా ఇబ్బందులు రాలేదు. కాకపోతే నేతలు వలసపోవడం కాస్త కుంగ దీసింది. ఇప్పటికే ఆ పార్టీని మేడిగడ్డ బ్యారేజ్ అంశం, విద్యుత్ కొనుగోళ్లు వంటి అంశాలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.వీటికి సంబంధించి విచారణ జోరుగా సాగుతోంది. వచ్చే నెల చివరికి నివేదిక రానుంది. దీనికితోడు ఫార్ములా ఈ –రేస్, ఔటర్ రింగ్ రోడ్డు టోల్ కాంట్రాక్టు వంటి కొత్త సమస్యలు తరుముకుంటూ వచ్చేశాయి. దీంతో ఏం చెయ్యాలో తెలియక తికమకపడుతున్నారు కీలక నేతలు.పదేళ్లు అధికారంలో ఉండడంతో బీఆర్ఎస్ నేతలకు అతి విశ్వాసం అమాంతంగా పెరిగిపోయింది. దాని ఫలితమే ఈ సమస్యలకు కారణం. ఈ లెక్కన కారు పార్టీ నేతలు కోరి తెచ్చుకున్న కష్టాలేనన్న మాట. ఆనాటి పాలకులు చాలా లాజిక్‌లు మిస్సయ్యారు.రాజకీయ నేతలు ఎక్కువ కాలం అధికారంలో ఉండరన్నది తొలి పాయింట్. రాజకీయాల్లో ఉంటారు.. కానీ అధికారం తక్కువ సమయంలో ఉంటారన్నది రెండోది. అధికారంలో ఉన్నప్పుడు అత్యంత బాధ్యతతో వ్యవహరించాల్సి ఉంటుంది. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే ఎలా ఉంటుందో ఇప్పుడే చూస్తున్నాం. తామే అధికారంలో ఉంటామనే అతి విశ్వాసం కూడా బీఆర్ఎస్‌ను కిందికి పడేలా చేసింది. ఒక్కోసారి తొందరపాటు చర్యలు నేతల మెడకు చుట్టు కుంటాయి. నిబంధనలు అతిక్రమించి చట్టాలను తమ చేతుల్లోకి తీసుకోవడం మరింత ఇబ్బందులకు గురి చేస్తుంది. అధికారం పోయిన తర్వాత పైసమస్యలు నష్టాన్ని చేకూరుస్తాయని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.కేటీఆర్ చేసిన పనే ఇందుకు ఓ ఎగ్జాంపుల్. గత ప్రభుత్వంలో కేటీఆర్ షాడో ముఖ్యమంత్రి అని చాలామంది నేతలు ఆఫ్ ద రికార్డులో చెబుతారు. నన్నెవరు ఏం చేస్తారు.. అధికారం మా శాశ్వతం అని అనుకున్నారు. అదే ఆయనకు ఇబ్బందులు తెచ్చిపెట్టింది.ఫార్ములా ఈ –రేస్ గురించి కేబినెట్ దృష్టికి తెస్తే సంతకాలు పెట్టకుండా ఆపే శక్తి ఎవరికైనా ఉందా? కేబినెట్ అప్రూవల్ అనేది ఐదు నిమిషాల పని. హెచ్‌ఎండీఏకు ఎలాగూ కేటీఆర్ డిపార్టుమెంట్. దానికి ఛైర్మన్ ముఖ్యమంత్రి, ఉపాధ్యక్షుడు కేటీఆర్. ఇక ఫైనాన్స్ డిపార్టుమెంట్ క్లియరెన్స్ గురించి అప్పటి మంత్రి హరీష్‌రావు ఫోన్ చెప్పినా సరిపోయేది. ఆ తర్వాత ఆర్బీఐ నుంచి అనుమతి ఈజీగా అయ్యేది.వీటిని కేటీఆర్ ఎందుకు ఉపయోగించులేదన్నది అసలు విషయం. అంటే దీని వెనుక ఏదో జరిగిందన్న చర్చ తెలంగాణ వ్యాప్తంగా మొదలైపోయింది. ఫార్ములా ఈ–రేస్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అరెస్ట్ చేస్తే జైలుకి వెళ్లి పుస్తకాలు చదువుతానని ఓపెన్ గా చెప్పారు కేటీఆర్.

# బిజినెస్

## ఎస్ఐపీల్లో పెట్టుబడుల వరద.. ఏడాదిలో ఏకంగా 233 శాతం వృద్ధి



భారతదేశంలో సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్‌లలో (సిప్‌లు) మొత్తం నికర పెట్టుబడుల్లో (సంవత్సర ప్రాతిపదికన) 233 శాతం భారీ వృద్ధి నమోదైంది. ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఈ స్థాయి పెట్టుబులు నమోదయ్యాయి. ఈ ఏడాది జనవరి నుంచి నవంబర్ వరకు మొత్తం నికర ఇన్‌ఫ్లోలు రూ.9.14 లక్షల కోట్లుగా ఉండగా 2023లో రూ. 2.74 లక్షల కోట్లు ఉన్నాయి. ఇది దాదాపు 233 శాతం వృద్ధికి సమానమని పలు నివేదికలు పేర్కొంటున్నాయి. నవంబర్ 2023లో రూ.30.80 లక్షల నుండి నమోదైన కొత్త ఎస్ఐపీల సంఖ్య నవంబర్ చివరి నాటికి రూ.49.47 లక్షలకు పెరిగింది. అంతేకాకుండా నిర్వహణలో ఉన్న ఎస్ఐపీ ఆస్తులు (ఏయూఎం) నవంబర్‌లో రూ.13.54 లక్షల కోట్లుగా ఉంది. ఏయూఎంలు రూ. 2023లో 9.31 లక్షల కోట్లుగా మాత్రమే ఉన్నాయి. భారతీయ మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ గతేడాది కాలంలో నికర ఇన్‌ఫ్లోలలో 135 శాతానికి పైగా పెరిగింది. అలాగే నికర ఏయూఎంలు దాదాపు 39 శాతం వృద్ధిని సాధించింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశం ప్రకాశవంతమైన స్థానంలో ఉండడానికి ఈ వృద్ధి అనేది కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. భారత ఆర్థిక వ్యవస్థలో దేశీయ మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ రాబోయే సంవత్సరాల్లో అనేక రెట్లు వృద్ధిని సాధిస్తుందని భావిస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు. మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీలోకి మొత్తం ఇన్‌ఫ్లోలు నవంబర్ 2023లో రూ.25,615.65 కోట్ల నుంచి నవంబర్ 2024లో రూ.60,295.30 కోట్లకు చేరాయి. అంటే దాదాపు 135.38 శాతం వృద్ధి నమోదైంది. గత ఏడాది నవంబర్‌లో రూ. 49.05 లక్షల కోట్ల వద్ద మాత్రమే నికర ఏయూఎం ఉందంటే వృద్ధి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. భారతదేశంలో అన్ని ఫండ్‌లు బలమైన వృద్ధిని సాధించగా ఈక్విటీ కేటగిరీ కింద లార్జ్ క్యాప్ ఫండ్స్‌లోకి ఇన్‌ఫ్లోలు అత్యధికంగా ఉన్నాయి. గత ఏడాది ఇదే కాలంలో రూ. 306.70 కోట్లు ఉండగా నవంబర్ 2024లో దాదాపు 731 శాతం పెరిగి రూ.2547.92 కోట్లకు చేరుకుంది. ఏయూఎంలో స్థిరమైన పెరుగుదలను చూసిన స్మాల్ క్యాప్, మిడ్-క్యాప్ ఫండ్‌లు దీర్ఘకాలిక పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో అంతర్గత వృద్ధిని సాధించాలనే ప్రభుత్వ ఉద్దేశానికి అనుగుణంగా పెట్టుబడులు కూడా పెరగడం అనేది శుభపరిణామమని నిపుణులు చెబుతున్నారు.

# ఇక్కడ అతి తక్కువ ధరకే బంగారం

ప్రపంచవ్యాప్తంగా బంగారం అత్యుత్తమ పెట్టుబడి ప్రాజెక్టులలో ఒకటిగా పరిగణిస్తాము. దీని కారణంగా చాలా మంది తమ చిన్న పొదుపులను బంగారంలో పెట్టుబడి పెడుతున్నారు. ప్రజలు బంగారాన్ని అనుబంధంగా మాత్రమే కాకుండా పెట్టుబడిగా కూడా చూస్తున్నారు. ఎందుకంటే ఇది అవసరమైన ఆర్థిక అవసరాలకు సహాయపడుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది ప్రజలు బంగారాన్ని ఉపయోగిస్తున్నందున బంగారం ధర పెరుగుతూనే ఉంది. మరో మాటలో చెప్పాలంటే, గత కొద్ది నెలల్లోనే బంగారం ధర అనేక రెట్లు పెరిగింది. బంగారం ధర ఇలా పెరగడంతో భవిష్యత్తులో బంగారం విలువైన రాయిగా మారుతుందన్న ఆలోచన ప్రజల్లో నెలకొంది. కానీ ప్రపంచంలో ఏ దేశంలో లేనంత తక్కువ ధరకు బంగారం అమ్ముడవుతోంది. అది ఎక్కడో చూద్దాం.

**బంగారం చాలా తక్కువ ధరలకు లభించే దేశం:**

చాలా తక్కువ ధరకు బంగారం దొరికే దేశం గురించి చాలా మందికి గుర్తుకు వచ్చేది దుబాయ్ లేదా మరేదైనా మధ్యప్రాచ్య దేశం. కానీ భూటాన్‌లో ప్రపంచంలోనే అత్యంత చవకైన బంగారం లభిస్తుంది. అతి తక్కువ ధరలకు బంగారం లభించే భూటాన్ భారతదేశానికి అత్యంత సమీపంలో ఉంది. భూటాన్ ఆసియాలో అందమైన దృశ్యాలు కలిగిన చిన్న దేశం. ప్రపంచంలో అత్యధికంగా ఉపయోగించే బంగారాన్ని ఇక్కడే అతి తక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి.

**బంగారాన్ని తక్కువ ధరలకు అమ్మడానికి కారణం ఏమిటి?**

భూటాన్‌లో బంగారంపై పన్ను లేదు. అందుకే బంగారం



చాలా తక్కువ ధరలకు అమ్ముడవుతోంది. భూటాన్‌లో ఆ దేశ ఆర్థిక రంగం దుకాణాల ద్వారా బంగారాన్ని విక్రయిస్తుంది. భూటాన్‌లో ఆ దేశ పౌరులే కాదు. ఇతర దేశాల పర్యాటకులు కూడా ఎలాంటి పన్ను లేకుండా చాలా తక్కువ ధరకు బంగారాన్ని కొనుగోలు చేయవచ్చు. అయితే అక్కడ బంగారాన్ని కొనుగోలు చేసేందుకు పర్యాటకులకు కొన్ని నిబంధనలు ఉన్నాయి. అంటే భూటాన్‌లో బంగారం కొనాలనుకునే పర్యాటకులు భూటాన్ ప్రభుత్వం గుర్తింపు పొందిన టూరిస్ట్ సెర్టిఫైడ్ హోటల్‌లో ఒక రాత్రి స్టే చేయాల్సి ఉంటుంది. అక్కడికి వెళ్లే టూరిస్టులు అమెరికా డాలర్లతోనూ గోల్డ్ కొనుగోలు చేయవచ్చు.

**డాలర్లు మాత్రమే అనుమతి**

పర్యాటకులు భూటాన్‌లో బంగారం కొనుగోలు చేయాలనుకుంటే వారు డాలర్లలో చెల్లించాలి. భారతదేశం విషయానికొస్తే, భారతీయులకు అదనపు రాయితీ అందిస్తారు. పన్ను రహిత బంగారం కొనుగోలు చేయాలంటే భారతీయులు సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ ఫీ (ఎస్‌డీఎఫ్) రూ.1,200 నుంచి రూ.1,800 చెల్లిస్తే సరిపోతుంది. ఒక్కో వ్యక్తికి రోజుకు రూ.1200 నుంచి రూ.1800 చెల్లించాలి. దీంతో వారి బంగారం కొనుగోలు ప్రక్రియ మరింత సులభతరం అవుతుంది.

ఈ ఎస్‌డీఎఫ్ టూరిజం ట్యాక్స్‌ను 2022లోనే భూటాన్ ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చింది. భారతీయులు ఒక వ్యక్తి ఒక రోజుకు రూ.1,200 నుంచి రూ.1,800 ట్యాక్స్ చెల్లించాలి. ఇతర దేశస్థులు 65 నుంచి 200 డాలర్ల వరకు కట్టాలి. ఈ ఎస్‌డీఎఫ్ టూరిజం ట్యాక్స్ కట్టిన వారికి మాత్రమే ఈ ట్యాక్స్ ఫ్రీ గోల్డ్ కొనేందుకు అర్హత లభిస్తుంది. ఈ బంగారాన్ని డ్యూటీ ఫ్రీ ఔట్‌లెట్స్‌లో కొనుగోలు చేయవచ్చు. భూటాన్ సందర్శించడానికి చాలా మంచి దేశం. ప్రతి సంవత్సరం లక్షలాది మంది ఇక్కడికి సందర్శిస్తుంటారు. భూటాన్‌లో 10 గ్రాముల బంగారం ధర దాదాపు రూ.58,000 వరకు ఉంటుంది. అయితే అక్కడ రోజువారి బంగారం ధరలను బట్టి ధరల్లో తేడా ఉండవచ్చు. గత ఏడాది సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్ విభాగం నిబంధనల ప్రకారం.. ఒక భారతీయుడు రూ.50 వేల విలువైన బంగారం తీసుకుని రావచ్చు. భారతీయ మహిళ రూ.1 లక్షల వరకు విలువైన గోల్డ్ తీసుకురావచ్చు. అంతకు మించి తీసుకువస్తే కస్టమ్స్ సుంకాలు చెల్లించాల్సి ఉంటుంది.

# పర్సనల్ లోన్స్ పొందడం ఇక మరింత ఈజీ.. తక్కువ సిబిల్ స్కోర్ ఉన్నా నో టెన్షన్!

పర్సనల్ లోన్ ప్రక్రియ అనేది ఇతర లోన్ ఆప్షన్‌లతో పోల్చితే కస్టమర్‌లకు చాలా సులభంగా అనిపిస్తుంది. ముఖ్యంగా పర్సనల్ లోన్ దరఖాస్తు చేయడానికి ముందు సంబంధిత సమాచారాన్ని కలిగి ఉండటం చాల ముఖ్యం. సరైన వివరాలు అందించడం వల్ల లోన్




ఆమోదం అవకాశాలు మెరుగ్గా ఉండడమే కాకుండా తక్కువ వడ్డీ రేటుతో రుణం పొందవచ్చు. ముఖ్యంగా పర్సనల్ లోన్ తీసుకోవడానికి మన ఆదాయం, క్రెడిట్ స్కోర్, ప్రస్తుత ఖర్చులతో సహా అనేక అంశాలను ఆధారంగా తీసుకుని రుణం ఇస్తారు. ఈ నిబంధనల్లో ఏ ఒక్కటి లేకపోయినా లోన్ అప్లికేషన్ రిజెక్ట్ అవుతుంది. ఇలా రిజెక్ట్ కాకుండా ఉండడానికి సహ రుణ గ్రహీత(కో బారోవర్) ఆప్షన్ ఉందని చాలా మందికి తెలియదు. తక్కువ క్రెడిట్ స్కోర్ లేదా సరిపోని ఆదాయం కారణంగా అర్హత ప్రమాణాలను విఫలమయ్యే వారికి సహ-రుణగ్రహీత ఎంపిక చాలా సౌకర్యంగా ఉంటుంది. ప్రాథమిక రుణగ్రహీతలతో పాటు వ్యక్తిగత రుణం కోసం దరఖాస్తు చేసే వ్యక్తి, రుణాలను తిరిగి చెల్లించే బాధ్యతను సహ దరఖాస్తుదా రులు పంచుకుంటారు. ఇదే ప్రక్రియలో దరఖాస్తును మూల్యాంకనం చేసేటప్పుడు రుణదాతలు సహ రుణగ్రహీత క్రెడిట్ చరిత్ర మరియు ఆర్థిక పరిస్థితిని కూడా పరిగణనలోకి తీసుకుంటారు. పర్సనల్ లోన్ కోసం అప్లై చేసేటప్పుడు ఆర్థిక సంస్థలు రుణ గ్రహీత జీవిత భాగస్వామి లేదా తల్లిదండ్రులు మాత్రమే సహ రుణగ్రహీతలుగా ఎంపిక చేస్తాయి. కొన్ని సంస్థలు అసాధారణమైన సందర్భాలలో సోదర, సోదరీలను కూడా అనుమతిస్తాయి. లోన్ అప్లికేషన్‌తో సహ రుణగ్ర హీతను జోడించడం వల్ల మీ అర్హతను గణనీయంగా మెరుగుపరుస్తుంది. అలాగే రుణం పొందేందుకు ఆదాయ నిష్పత్తిని తగ్గిస్తుంది. తద్వారా రుణగ్రహీతలు అధిక మొత్తంలో రుణానికి అర్హత పొందవచ్చు. ముఖ్యంగా సహ రుణగ్రహీత ఆప్షన్‌ను ఎంచుకోవడం వల్ల అనుకూలమైన వడ్డీ రేట్లతో రుణం పొందవచ్చు. అయితే సహ-రుణగ్రహీతలు తిరిగి చెల్లింపు బాధ్యతను పంచుకోవాల్సి వస్తుంది. ఒకవేళ మీరు రుణం సరిగ్గా చెల్లించకపోతే సహ-రుణగ్రహీత క్రెడిట్ స్కోర్ కూడా ప్రభావితమవుతుంది. సహ-రుణగ్రహీతలు ఆదాయ అర్హతను పెంచడంలో కీలకపాత్ర పోషిస్తారు. రుణదాతలు సాధారణంగా వారి నెలవారీ ఆదాయంతో పోల్చితే తక్కువ నెలవారీ అప్పులు ఉన్న రుణగ్రహీతల కోసం వెతుకుతున్నం దున డీటీఐ నిష్పత్తి రుణ ఆమోద అవకాశాలను మెరుగు పరుస్తుంది. ముఖ్యంగా ఇప్పటికే రుణం ఉన్నవారిని కూడా సహ-రుణగ్రహీతలుగా ఎంచుకోవచ్చు.

# స్పోర్ట్స్

## అండర్ 19 ఆసియా మహిళల టీ20 చాంపియన్‌గా భారత్

కౌలాలంపూర్: మహిళల అండర్-19 ఆసియాకప్ టోర్నీలో యువ భారత్ అదరగొట్టింది. టోర్నీలో అపజయమెరుగని నిక్కీ ప్రసాద్ సారథ్యంలోని భారత జట్టు కౌలాలంపూర్‌లో జరిగిన ఫైనల్‌లో బంగ్లాదేశ్‌ను మట్టికరిపించింది. దీంతో ఆసియా క్రికెట్ కౌన్సిల్ తొలిసారిగా నిర్వహిస్తున్న టోర్నీని టీమ్ఇండియా సొంతం చేసుకున్నది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 117 పరుగులకు పరిమితమయింది. స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేకపోయిన బంగ్లా జట్టు 76 రన్స్‌కే ఆలౌట్ అయింది. దీంతో 41 రన్స్‌తో విజయం సాధించిన యువ భారత్ టోర్నీని విజేతగా నిలిచింది. టాస్ గెలిచిన బంగ్లాదేశ్.. భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. అయితే బ్యాటర్లు విఫలమవడంతో 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 117 రన్స్‌కే పరిమితమైంది. అయితే కష్టాల్లో ఉన్న జట్టును తెలంగాణ యువ కెరటం గొంగడి త్రిష మరోసారి ఆదుకుంది. 5 ఫోర్లు, రెండు సిక్సర్ల సాయంతో 41 బాల్స్‌లోనే 52 రన్స్ చేసి టాప్ స్కోరర్‌గా నిలిచింది. మరో బ్యాటర్ మైథిలి వినోద్ 12 బాల్స్‌లోనే 17 పరుగులు రాబట్టింది. ఇక చేజింగ్‌కు దిగిన బంగ్లా బ్యాటర్లు భారత




బౌలర్లను ఎదుర్కొలేకపోయారు. దీంతో 18.3 ఓవర్లలో 76 రన్స్‌కే ఆలౌట్ అయ్యారు. ఆయుశి శుక్లా 3 వికెట్లు తీయగా, పరుణికా సిసోడియా 2 వికెట్లు పడగొట్టింది.

## రోహిత్ అలా ఆడితేనే పరిస్థితులు మారతాయి.. ఆరో స్థానంలో అతడు డేంజరస్ బ్యాటర్



టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ప్రస్తుత ఆస్ట్రేలియా పర్యటనలో దారుణంగా విఫలమవుతున్నాడు. పేలవ ఫామ్‌తో సతమతమవుతున్నాడు. కేఎల్ రాహుల్ ఓపెనర్‌గా కుదురుకోవడంతో రోహిత్ ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వస్తున్నాడు. ఆ స్థానంలో పరిస్థితులకు తగినట్టు ఆడలేక విఫలమవుతున్నాడు. దీంతో రోహిత్ తిరిగా ఫామ్ అందుకోవాలంటే ఓపెనర్‌గానే బరిలోకి దిగాలని పలువురు మాజీలు సూచిస్తున్నారు. అయితే టీమిండియా మాజీ కోచ్ రవిశాస్త్రి మాత్రం భిన్నంగా స్పందించాడు. రోహిత్ లాంటి ఆటగాడికి ఆరో స్థానమే కరెక్ట్ అని అభిప్రాయపడ్డాడు కేఎల్ రాహుల్ ఓపెనర్‌గా మంచి ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శిస్తున్నాడు. అతడి కవర్‌డ్రైవ్‌లు చూస్తుంటే అతడు ఆ స్థానాన్ని ఆస్వాదిస్తున్నట్టు అనిపిస్తోంది. ఎలాంటి బాల్ ఆడాలి, దేనిని వదిలేయాలి అనే విషయంలో చాలా క్లారిటీతో ఉన్నాడు. రోహిత్ ఓపెనర్‌గా రావాలనుకుంటే తప్పు లేదు. కానీ, నా ఉద్దేశంలో రోహిత్‌కు ఆరో స్థానమే కరెక్ట్. ఆరో స్థానంలో రోహిత్ డేంజరస్ ఆటగాడు. టెస్ట్ క్రికెట్‌లో చాలా మంది దూకుడైన ఆటగాళు ఆరో స్థానంలోనే బ్యాటింగ్‌కు దిగుతారు. టెస్ట్ మ్యాచ్‌లో మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కు దిగేటపుడు రోహిత్ శర్మ తన మైండ్‌సెట్‌ను మార్చుకోవాలని రవిశాస్త్రి అభిప్రాయపడ్డాడు. అప్పటికే ఐదారు వికెట్లు పడిన కారణంగా నెమ్మదిగా ఆడాలని చాలా మంది అనుకుంటారు. కానీ, సాధ్యమైనన్ని పరుగులు చేయడమే లక్ష్యంగా ఆరో నెంబర్ బ్యాటర్ ఎటాకింగ్ చేయాలి. రోహిత్ కూడా అదే పని చేస్తే పరిస్థితి మారే అవకాశం ఉంటుంది. రోహిత్ తాను ఎదుర్కొన్న తొలి బంతి నుంచే దూకుడు ప్రదర్శించాలని రోహిత్ శర్మ అన్నాడు.

## ద టీజ్ బుమ్రా.. 47 నెలలు, 4116 బంతులు.. సిక్స్ కొట్టేందుకు భయపడుతోన్న బ్యాటర్లు

భారత వర్సెస్ ఆస్ట్రేలియా జట్ల మధ్య బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ నడుస్తోంది. ఇప్పటికే మూడు టెస్ట్‌లు ముగిశాయి. భారత్ తొలి టెస్ట్ గెలవగా, రెండో టెస్ట్ ఆస్ట్రేలియా గెలిచింది. ఇక మూడో టెస్ట్ డ్రాగా ముగిసింది. అయితే, జస్ప్రీత్ బుమ్రా అత్యధిక వికెట్లతో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ క్రమంలో బుమ్రా బౌలింగ్‌లో సిక్స్‌లు కొట్టేందుకు బ్యాటర్లు భయపడుతున్నారు.

జస్ప్రీత్ బుమ్రా జులై 2023లో గాయం నుంచి తిరిగి వచ్చినప్పటి నుంచి విధ్వంసం సృష్టిస్తున్నాడు. 2024లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. 2024 టీ20 ప్రపంచకప్‌లో ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్‌గా నిలిచాడు. ఆస్ట్రేలియా టూర్‌లో టీమిండియా తరపున జస్ప్రీత్ బుమ్రా విధ్వంసం సృష్టిస్తున్నాడు. మూడు టెస్టుల్లో 21 వికెట్లతో ముందంజలో ఉన్నాడు. 10.90 సగటుతో బుమ్రా ఈ వికెట్లు తీశాడు. జస్ప్రీత్ బుమ్రా ఇప్పటివరకు ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్స్‌కు అతిపెద్ద తలనొప్పిగా మారాడు. పెర్త్ టెస్ట్‌లో



150 పరుగులకే కుప్పకూలిన తర్వాత కూడా భారత జట్టు ఆతిథ్య జట్టును చిత్తు చేసింది. జనవరి 2021 నుంచి టెస్ట్ క్రికెట్‌లో జస్ప్రీత్ బుమ్రాపై ఏ బ్యాట్స్‌మెన్ కూడా సిక్స్ కొట్టలేకపోయాడు. ఆస్ట్రేలియా టూర్‌లో సిడ్నీ టెస్ట్‌లో చివరిసారి ఇలా జరిగింది. ఆ తర్వాత అతని బంతికి కామెరూన్ గ్రీన్ సిక్సర్ కొట్టాడు. సిడ్నీ టెస్టు నుంచి జస్ప్రీత్ బుమ్రా ఈ ఫార్మాట్‌లో 4116 బంతులు వేసి ఒక్క సిక్స్ కూడా వేయలేదు. గ్రీన్ సిక్స్ కొట్టి 47 నెలలైంది. వచ్చే నెలలో సిడ్నీలో భారత్ మళ్లీ ఆడబోతోంది.

జస్ప్రీత్ బుమ్రా టెస్టు క్రికెట్‌లో ఏ సిక్సర్ కూడా వేయకుండా అత్యధిక బంతులు బౌలింగ్ చేయడంలో నాలుగో స్థానంలో ఉన్నాడు. 5585 బంతులు ఆడిన ఆస్ట్రేలియాకు చెందిన మిచెల్ స్టార్క్ సిక్సర్ కూడా వేయకుండానే ముందంజలో ఉన్నాడు. ఆ తర్వాత జేమ్స్ అండర్సన్, స్టువర్ట్ బ్రాడ్ పేర్లు ఉన్నాయి. జస్ప్రీత్ బుమ్రా టెస్టులో ఇప్పటివరకు మొత్తం ఏడు సిక్సర్లు బాదాడు. జోస్ బట్లర్ గరిష్టంగా రెండుసార్లు చేశాడు. వీరితో పాటు ఏబీ డివిలియర్స్, ఆదిల్ రషీద్, మొయిన్ అలీ, నాథన్ లియోన్, కామెరాన్ గ్రీన్ పేర్లు కూడా వస్తున్నాయి. జస్ప్రీత్ బుమ్రా జులై 2023లో గాయం నుంచి తిరిగి వచ్చినప్పటి నుంచి విధ్వంసం సృష్టిస్తున్నాడు. 2024లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. 2024 టీ20 ప్రపంచకప్‌లో ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్‌గా నిలిచాడు.

# పార్ట్1-సీజ్‌ఫైర్'కు ఏడాది పూర్తి

## పార్ట్ 2 'శౌర్యాంగ పర్వం' రిలీజ్ ఎప్పుడంటే?



భారీ తారాగణం, కాన్వాస్, అబ్బురపరిచే యాక్షన్ సన్నివేశాలతో సలార్ సినిమా యాక్షన్ జోనర్‌లో సరికొత్త పంథాను క్రియేట్ చేసింది. ప్రభాస్ మాస్ అప్పీల్, పృథ్వీరాజ్ సుకుమారన్ పెర్ఫామెన్స్ సహా అన్నీ ఎలిమెంట్స్ దీన్ని ఓ కల్ట్‌మూవీగా నిలబెట్టింది. ఓటీటీ మాధ్యమంలో 'సలార్: పార్ట్1-సీజ్‌ఫైర్' 300 రోజుల పాటు ట్రాప్ ట్రెండింగ్‌లో నిలవటం విశేషం. ఇది సినిమా ప్రేక్షకుల మనసుల్లో సంపాదించుకున్న స్థానం, తిరుగులేని విజయానికి తార్కాణంగా నిలిచింది. అలాగే ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా రీ రిలీజ్ అయిన ఈ చిత్రం అద్భుతమైన స్పందనను రాబట్టుకుంది. 'సలార్: పార్ట్1-సీజ్‌ఫైర్' అనేక ఊహించని మలుపులు తిరుగుతూ సీక్వెల్‌గా 'సలార్ పార్ట్2: శౌర్యాంగ పర్వం' రానుందని ఆశ్చర్యపరిచింది. ఈ రెండో భాగానికి సంబంధించిన షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది. సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రముఖ నిర్మాణ సంస్థ హెూంబలే ఫిల్మ్స్ బ్యానర్‌పై విజయ్ కిరగందూర్ సలార్ చిత్రాన్ని నిర్మించారు. ప్రభాస్ టైటిల్ పాత్రలో నటించిన చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటించగా శ్రుతీ హాసన్, జగపతి బాబు, శ్రియా రెడ్డి తదితరులు ఇతర ప్రధాన పాత్రల్లో మెప్పించారు. 'సలార్: పార్ట్1-సీజ్‌ఫైర్' ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా హెూంబలే ఫిల్మ్స్ 'సలార్ పార్ట్2: శౌర్యాంగ పర్వం' షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుందని తెలియజేసింది. ఇక ప్రస్తుతం ప్రభాస్ చేతిలో ఒక అరడజనకు పైగా సినిమాలున్నాయి. సలార్ పార్ట్ -2, కల్కి-2 సినిమాలతో పాటు ది రాజా సాబ్, ఫౌజీ, స్పిరిట్ మూవీస్ ఉన్నాయి.

# అభిమానులకు అల్లు అర్జున్ కీలక రిక్వెస్ట్!



ప్రముఖ నటుడు అల్లు అర్జున్ సోషల్ మీడియా వేదికగా అభిమానులకు కీలక సూచన చేశారు. తన ఫ్యాన్స్ తమ అభిప్రాయాలను బాధ్యతాయుతంగా వ్యక్తపరచాలని, ఎవరినీ వ్యక్తిగతంగా కించపరిచే విధంగా పోస్టులు వేయవద్దని సూచించారు. ఫ్యాన్స్ ముసుగులో గత కొన్ని రోజులుగా ఫేక్ ఐడీ, ఫేక్ ప్రొఫైల్స్‌తో పోస్టులు వేస్తున్న వారిపై చర్యలు తీసుకోబడుతాయని హెచ్చరించారు. నెగెటివ్ పోస్టులు వేస్తున్న వారికి దూరంగా వుండాలని నా ఫ్యాన్స్‌కు సూచించారు. సంధ్య థియేటర్ వ్యవహారం కొత్త మలుపు తీసుకున్నది. అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి అల్లు అర్జున్‌పై తీవ్రంగా స్పందించిన విషయం తెలిసిందే. థియేటర్‌లో ఒక తల్లి చనిపోయినా మానవత్వం లేకుండా రూఫ్‌టాప్ ఓపెన్ చేసి చేతులు ఊపుకుంటూ వెళ్లిపోయాడని విమర్శించారు. అయితే, పోలీసుల అనుమతి లేకుండానే థియేటర్‌కు వెళ్లి, రోడ్‌షో, ర్యాలీ నిర్వహించినట్లు వస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవమని అల్లు అర్జున్ స్పష్టంచేశారు. అయితే, తనపై వస్తున్న విమర్శలపై అల్లు అర్జున్ తోసిపుచ్చారు. తొక్కిసలాట ఘటనలో తన వ్యక్తిత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని వాపోయారు. థియేటర్ వద్ద జరిగిన ఘటన చాలా దురదృష్టకరమని.. బాధిత కుటుంబానికి సానుభూతి తెలియజేస్తున్నానని, చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. తన ఇమేజ్‌ను డ్యామేజ్ చేసే ప్రయత్నం జరుగుతుందని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.


# రామ్ చరణ్ దెబ్బతో ఇండస్ట్రీ రేంజ్, లెక్కలు మారిపోయినట్టే.!



ఇండస్ట్రీ రేంజ్ మారిపోయింది.. లెక్కలు మారుతున్నాయి.. పెద్ద సినిమాలు వస్తే అంతా ముందుగా మాట్లాడుతున్నది కలెక్షన్ల గురించే. మరీ ముఖ్యంగా %ఖూ% ప్రీమియర్స్‌లో ఎంత వస్తున్నాయనే చర్చ కూడా షురూ అయింది. మరిప్పుడు గేమ్ ఛేంజర్ ప్రీ రిలీజ్ అక్కడే జరగబోతుంది. మరి రామ్ చరణ్ ముందు ఏయే టార్గెట్స్ ఉన్నాయి..? వాటిని గేమ్ ఛేంజర్ అందుకుంటాడా..? గేమ్ ఛేంజర్ ప్రమోషన్స్ కాస్త ఆలస్యంగా మొదలయ్యాయేమో కానీ ఒక్కసారి మొదలయ్యాక మాత్రం ఎక్కడా తగ్గట్లేదు మేకర్స్ మరి రామ్ చరణ్ ముందు ఏయే టార్గెట్స్ ఉన్నాయి..? వాటిని గేమ్ ఛేంజర్ అందుకుంటాడా..? గేమ్ ఛేంజర్ ప్రమోషన్స్ కాస్త ఆలస్యంగా మొదలయ్యాయేమో కానీ ఒక్కసారి మొదలయ్యాక మాత్రం ఎక్కడా తగ్గట్లేదు మేకర్స్. ఓవర్సీస్ ఆడియన్స్‌ను ఆకట్టుకోడానికి అక్కడే ఈవెంట్ ప్లాన్ చేసారు గేమ్ ఛేంజర్ టీం. ఇది అక్కడ కలెక్షన్లు పెంచడంలోనూ యూజ్ కానుంది. రీసెంట్‌గా వచ్చిన పెద్ద సినిమాలు ఓవర్సీస్‌లో ప్రీమియర్స్ నుంచే రికార్డులు తిరగరాసాయి. దేవరకు ప్రీమియర్స్‌తో కలిపి ఫస్ట్ డే 3.77 మిలియన్ వస్తే.. పుష్ప 2కు 4.33 మిలియన్, కల్కి 2898 ఏడికి 5.56 మిలియన్ డాలర్స్ వచ్చాయి. గేమ్ ఛేంజర్‌కు ఓవర్సీస్‌లో ఓపెనింగ్స్ పరీక్ష మొదలైందిప్పుడు. ఇది ఏ స్థానంలో ఉంటుందా అనే చర్చ మొదలైంది ట్రేడ్ వర్గాల్లో..! చరణ్‌కు ఓవర్సీస్ మార్కెట్ ఎక్కువే. పైగా శంకర్ సినిమాలు అక్కడ రప్ఫాడిస్తుంటాయి. దిల్ రాజు బ్రాండ్ ఎలాగూ ఉంది. ఈ ముగ్గురూ కలిసి ఎన్ని మిలియన్స్ ఓపెనింగ్ తీసుకొస్తారనేది ఆసక్తికరంగా మారిందిప్పుడు. జనవరి 9న భారీగా ప్రీమియర్స్ పడనున్నాయి.

# రామ్ చరణ్‌కు జాతీయ అవార్డు పక్కా

## గేమ్ ఛేంజర్ సినిమాకు సుకుమార్ ఫస్ట్ రివ్యూ



గేమ్ ఛేంజర్ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఛరిష్మా డ్రీమ్స్ రాజేష్ కల్లెపల్లి ఆధ్వర్యంలో డల్లాస్‌లో గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుకుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ మాట్లాడుతూ.. 'శంకర్ గారు చేసిన స్నేహితుడు సినిమాకు గెస్టుగా వెళ్లాను. ఆ టైంలో ఆయనతో మాట్లాడేందుకు కూడా చాలా టెన్షన్ పడ్డాను. నాతో కాకపోయినా ఎవరితో అయినా సరే ఓ తెలుగు సినిమా చేయండని అడుగుదామని కూడా అడగలేకపోయాను. కింగ్ ఆఫ్ ఇండియన్ సినిమా.. క్రికెట్‌కు సచిన్ ఎలాగో.. ఇండియన్ సినిమాకు శంకర్ గారు అలా.. డైరెక్టర్లకే డైరెక్టర్ ఆయన. అలాంటి శంకర్ గారితో పని చేయడం నా అదృష్టం. నా నుంచి సోలో ఫిల్మ్ వచ్చి ఐదేళ్లు అవుతోంది. ఇది నాకు చాలా ప్రత్యేకమైన సినిమా. ఈ మూవీ ఏ ఒక్కర్నీ నిరాశపర్చదు. ఏం సాధించాలన్నా సహనం ఉండాలి. పుష్ప 2తో సుకుమార్ గారు అద్భుతమైన విజయాన్ని అందుకున్నారు. అలాంటి సుకుమార్ గారు మా ఈవెంట్‌కు వచ్చి మాట్లాడటం ఆనందంగా ఉంది. దిల్ రాజు గారితో పని చేయడం ఆనందంగా ఉంది' అని అన్నారు. సెన్సేషనల్ డైరెక్టర్ సుకుమార్ మాట్లాడుతూ.. 'ఓవర్సీస్ ఆడియెన్స్ తెలుగు సినిమాల్ని ఎక్కువగా ఆదరిస్తుంటారు. వన్ నేనొక్కడినే మూవీని ఇక్కడి ఆడియెన్స్ ఆదరించి ఉండకపోతే నాకు నెక్స్ట్ సినిమాలు వచ్చేవి కావు. దిల్ రాజు గారు నాకు ఫస్ట్ ఛాన్స్ ఇచ్చాడు. నన్ను నిలబెట్టినందుకు దిల్ రాజు గారి రుణం ఎప్పటికీ తీర్చుకోలేను. శంకర్ గారి చేతుల మీదుగా ఫిల్మ్ ఫేర్ అవార్డు తీసుకున్నాను. చిరంజీవి గారు ఎందుకు శంకర్ గారితో సినిమా చేయలేదు.. శంకర్ గారు ఎందుకు తెలుగు సినిమా చేయడం లేదు? అని అనుకునేవాళ్లం. కానీ శంకర్ గారితో రామ్ చరణ్ సినిమా అని తెలియడం తెగ ఆనంద పడ్డాను. ఈ విషయాన్ని రామ్ చరణ్ మొదటగా నాకే చెప్పినట్టున్నాడు. సూర్య తీసిన ఖుషి నాకు చాలా ఇష్టం. రైటర్‌గా వచ్చి డైరెక్టర్‌గా చేశా. ఖుషి సినిమాను రిఫరెన్సుగా పెట్టుకున్నాను. అంజలి మా ఊరు అమ్మాయి. చాలా బాగా నటించారు. నేను క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు తమన్ సాయం చేశాడు. కానీ అది నేను వాడుకోలేకపోయాను. ఓ హీరోతో సినిమా చేసినప్పుడు ఆ హీరోని ఎక్కువగా ప్రేమిస్తాను. రంగస్థలం అయిపోయాక కూడా ఆ అనుబంధం రామ్ చరణ్‌తో మాత్రమే కొనసాగింది. రామ్ చరణ్‌తో ఎప్పుడూ టచ్‌లోనే ఉంటాను. చిరంజీవి గారితో కలిసే ఈ గేమ్ చేంజర్ చూశాను. ఫస్ట్ హాఫ్ అద్భుతం.. ఇంటర్వెల్ బ్లాక్ బస్టర్.. సెకండాఫ్‌లో ఫ్లాష్ బ్యాక్ గూస్ బంప్స్, ఫినామినల్.. జెంటిల్మెన్, భారతీయుడు చిత్రాలను ఎంతగా ఎంజాయ్ చేశానో మళ్లీ అంతే ఎంజాయ్ చేశాను. రంగస్థలం తరువాత రామ్ చరణ్‌కు జాతీయ అవార్డు వస్తుందని అనుకున్నాను. కానీ రాలేదు. ఇక గేమ్ చేంజర్ క్లైమాక్స్‌లో రామ్ చరణ్ నటనకు జాతీయ అవార్డు పక్కాగా వస్తుంది' అని అన్నారు. స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు మాట్లాడుతూ.. 'డల్లాస్‌లో ఈవెంట్ గురించి రాజేష్‌తో మాట్లాడాం. అద్భుతంగా ఆర్గనైజ్ చేశారు. ఈవెంట్ గురించి అంతా మాట్లాడుకుంటున్నారు. 1998లో ఒకే ఒక్కడు సినిమాతో మా జర్నీ ప్రారంభం అయింది. శంకర్ గారు, చంద్రబాబు గారి చేతుల మీదుగా వంద రోజుల షీల్డ్ తీసుకున్నాం.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,